తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# ఐదువేలు చెల్లిస్తే రైట్‌రైట్.. లేకుంటే ఛల్ ఛల్ !

**- అన్నీ సక్రమమే.. అయినా రిజిస్ట్రేషన్ కోసం ఆమ్యామ్యాకి డిమాండ్**

కుప్పంరూరల్, నవంబర్ 23 ప్రభాతవార్త : ఆర్థిక ఇబ్బందులు ఉన్న నేపథ్యంలో తమకు చెందిన భూమిని కేవలం 43వేల రూపాయలకు విక్రయించి రిజిస్ట్రేషన్‌కు వచ్చిన ఓ కుటుంబానికి అక్షరాలా ఐదువేల రూపాయలు డిమాండ్ చేశారు.. అంత ఇచ్చుకోలేము, వెయ్యో.. రెండువేలో ఇస్తాము అంటే.. అలా కుదరదు అని చెప్పి రిజిస్ట్రేషన్ చేయక పోవడంతో వారు కడుబాధతో వెనుతిరిగిన వైనం ఇది. కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాల యంలో ఆమ్యామ్యాలకు అంతు లేకుండా పోతుండడంతో సామాన్య జనం పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయనేందుకు ఈ వ్యవహారం ఓ మచ్చుతునక మాత్రమే. చేయితడపనిదే ఇక్కడ పనులు జరగవని ప్రజలే బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఈసంఘటనకు సంబంధించిన వివరాలిలా..

ఓ గ్రామానికి చెందిన వారు తనకు ఉన్న భూమిని 43వేలకు వి క్రయించారని సమాచారం. వీరు ఈ భూమిని కొనుగోలు చేసిన వ్యక్తికి బుధవారం రిజిస్ట్రేషన్ చేసేందుకు కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన చలానా నగదు సైతం వీరు చెలించగా సిఎస్ నెంబరు సైతం కేటాయించారు. డాక్యుమెంట్లు అన్నీ పక్కాగా ఉన్నాయి ఇక రిజిస్ట్రేషన్ అయిపోతుంది అని ఆ కుటుంబం అనుకునేలోపే లంచావతారులు బయలుదేరారు. ఈ రిజిస్ట్రేషన్ కోసం ఐదువేల రూపాయలు చెల్లించాల్సి ందేనని పేర్కొన్నారని సమాచారం. దీంతో ఆ కుటుంబం తమ వద్ద అంత లేదు వెయ్యో, రెండువేలో ఇస్తాము అంటే ఛల్‌ఛల్ అన్నారు. చివరకు బేరం ఐదువేలకు కుదరకపోవడంతో పాపం రిజిస్ట్రేషన్ ఆగిపోయింది. దీంతో చేసేది లేక బాధితులు వెనుతిరిగారు. ఈ తరహా సంఘటనలు ఇక్కడ షరా మామూలు గానే జరుగుతున్నాయని జనం పేర్కొంటున్నారు. ఒక్కో గ్రామకంఠం భూమిని రిజిస్టర్ చేసేందుకు అక్షరాలా పదివేలు తీసుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఏది ఏమైనా కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లీలలు తవ్వేకొద్దీ కుప్పలు తెప్పలుగా వస్తుండడం గమనార్హం.

## భక్తి శ్రద్ధలతో స్వర్ణముఖిలో...

# బిల్వాలు,కుంకుమ నిమజ్జనం

**కార్తీక బహుళ అమావాస్య సందర్భంగా స్వామి అమ్మవార్లకు అష్టోత్తర శత కలశాభిషేకం**



పవిత్ర బిల్వ, కుంకుమను ఊరేగింపుగా తీసుకువస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి,నవంబర్ 23 ప్రభాతవార్త : పది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో నిర్వహించిన స్వామికి బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చనలు బుధవారంతో ముగిసాయి. ప్రతి ఏడాది కార్తీక మాసంలో నిర్వహించే ఉత్సవాల్లో 'స్వామికి లక్ష బిల్వార్చన, అమ మ్మవారికి లక్ష కుంకుమార్చన'లు ప్రత్యేకం. ఈ సేవకు దేవస్థానం రూ.200 టిక్కెట్లు ఖరారు చేసి భక్తుల్ని అనుమతించారు. రెండేళ్ళ పాటు కోవిడ్ నిబంధనలతో



ఏకాంతంగా నిర్వహించిన లక్ష బిల్వార్చన కుంకుమార్చనలు బుధవారంతో ముగిసాయి. ముగింపు పూజల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వారి సహచర సభ్యులు, ఆలయ ఇఓ వికె సాగర్‌బాబు దంపతులు వారి సిబ్బంది భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద ఆలయ సంప్రదాయం ప్రకారం,శాస్త్రోక్తంగా అష్టోత్తర కలశాలు ఏర్పాటు చేసారు. ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాధన్ గురుకుల్, అచ్చితా గురుకుల్‌లు పూజలు నిర్వహించారు.పది రోజుల పాటు ప్రతి రోజూ అలంకార మండపంలో వేదపండితుల వేదఘోషతో కార్యక్రమాల్ని సాగించారు. ప్రతి రోజూ ఆలయ ఇఓ ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ ఇఓ వికెసాగర్‌బాబులు పాల్గొని పర్యవేక్షించారు.గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఏడాది కార్తీక మాసంలో ఆలయానికి భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు. మంగళవారం రాత్రి ఆలయం సారధ్యంలో నదీ హారతులు నిర్వహించి బుధవారం చివరి రోజు కావటంతో విశేష స్పందన వచ్చింది. బుధవారం మూడు కాలాల తరువాత 4వ కాలము ప్రదోష కాల అభిషేకానంతరం శాస్త్రోక్తంగా ముగింపు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్తీక బహుళ అమావాస్య సందర్భంగా స్వామి అమ్మవార్లకు అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు. ఓ వైపు భక్తుల తాకిడి మరో వైపు సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించారు. తరువాత పది రోజుల పాటు శాస్త్రోక్తంగా ఊరేగింపుగా పత్రి, కుంకుమలను మేళ తాళాలు మంగళవాయిద్యాలతో సన్నిధివీధి నుంచి జీవనది స్వర్ణముఖి నదిలోకి తీసుకెళ్ళి భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలిఇఓ వికెసాగర్‌బాబు, శాసనసభ్యుని సతీమణి బియ్యపు వాణి, ఆలయ ఎసి మల్లికార్జున్ ప్రసాద్, డెప్యూటీఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి టెంపుల్ ఇన్సెపెక్టర్ హరియాదవ్‌లు పాల్గొన్నారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## భక్తులకు కనువిందు చేసిన...

# కల్పవృక్ష, హనుమంత వాహనాలు

**శ్రీ రాజమన్నార్ అలంకారంలో కల్పవృక్ష వాహనంపై విహరించిన అమ్మవారు**

తిరుచానూరు,నవంబర్ 23 ప్రభాతవార్త: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం ఉదయం అమ్మవారు శ్రీ రాజమన్నార్ అలంకారంలో చర్నాకోలు,దండం



కల్పవృక్ష వాహనంపై విహరిస్తున్న పద్మావతి దేవి

ధరించి కల్పవృక్ష వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. మధ్యాహ్నం 12-30 గంటల నుండి శ్రీకృష్ణస్వామి మండపంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు.అనంతరం అమ్మవారికి విశేషంగా అలంకారం చేసి సాయంత్రం 5-30 నుండి 6 గంటల వరకు ఊంజల్‌సేవను వైభవంగా నిర్వహించారు.రాత్రి 7 నుండి 9 గంటల వరకు శ్రీ పద్మావతి అమ్మవారు హనుమంత వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అశ్వాలు, వృషభాలు, గజాలు ముందు కదులుతుండగా భక్తుల కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు.అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి అమ్మవారిని మనసారా సేవించుకున్నారు.ఈ వాహన సేవల్లో టిటిడి ఈఓ ధర్మారెడ్డి దంపతులు, చంద్రగిరి ఎమ్మెల్యే,టిటిడి బోర్డు సభ్యుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, సేఈఓ వీరబ్రహ్మం దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆగమ సలహాదారు శ్రీనివాసా చార్యులు, విఎస్ఓలు మనోహర్, బాలిరెడ్డి, ఏవిఎస్ఓ శైలేంద్రబాబు, ఆలయ అర్చకులు బాబుస్వామి, సూపరింటెం డెంట్లు శేషగిరి,మధు,ఆర్జితం ఇన్స్‌పెక్టర్ దాము తదితరులు పాల్గొన్నారు.



హనుమంత వాహనంపై అమ్మవారు

**నూతన సూర్యప్రభ వాహనంకు ప్రత్యేక పూజలు:**



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం 3 కోట్ల రూ॥ల వ్యయంతో ప్రత్యేకంగా తయారు చేయించిన నూతన సూర్యప్రభ వాహనానికి టిటిడి ఈఓ ధర్మారెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి,జేఈఓ వీరబ్రహ్మంలు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

## ప్రమాదకరపు బడిలో...

# విద్యార్థుల చదువులు

**- పొంచి ఉన్న ప్రమాదం... పట్టించుకోని అధికారులు**



పెచ్చులూడుతున్న దృశ్యం

దొరవారిసత్రం, నవంబర్ 23 ప్రభాతవార్త : ఖాళీగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలను కొంత మంది తమ ఆధీనంలోకి తీసుకొని వారి సొంత భవనాల్లాగా ఉపయో గించుకుంటున్నారు. ఒకటి కాదు రెండు కాదు.. పదుల సంఖ్యలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల భవనా లను వారి సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. అయి తే దీన్ని పట్టించుకోవాల్సిన అధి కారులు కన్నెత్తి కూడా చూడకపోవడంతో ఆక్రమణ దారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దొరవారిసత్రం మండలం వేనాటి సుబ్బారెడ్డి నగర్, బురదమడుగు, తల్లంపాడు, మావిళ్లపాడు తదితర గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల భవనాలను కొంతమంది ఆక్రమించుకొని సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఈ క్రమంలోనే వీఎస్ఆర్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల భవనంలో వలస కూలీలు ఉండటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఖాళీగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు ఆక్రమణకు గురవుతున్నాయి. ప్రమాదం పొంచి ఉన్న పాఠశాలల్లో విద్యార్థులు ప్రాణాలు అరచేత పెట్టుకొని చదువు కుంటున్నారు. పలువురు అంటున్నారు. దొరవారిసత్రం మండలం టపాయిండ్లు పాఠశాలలో సుమారు 50 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే వీరికి సరైన భవనాలు లేకపోవడం, ఉన్న ఆ భవనంలో పెచ్చులూడి పడుతుండటంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు భయాం దోళనకు గురవుతున్నారు. పలుమార్లు విద్యార్థులు, తల్లిదండ్రులు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతో ఆ పాఠశాలల్లోనే ప్రమాదపుటంచులో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువుకుంటున్నారు.

**విలీనమైన పాఠశాలలన్నీ ఆక్రమణల చెరలో..**

ప్రభుత్వం ఆదేశాల మేరకు గత సంవత్సరం విలీనమైన పాఠశాల భవనాలన్నింటినీ ఆయా గ్రామా ల్లో బడా నాయకుల ఆధ్వర్యంలో ఆక్రమణలకు గురవుతున్నాయి. ఖాళీగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల భవ నాల్లో పలువురు తమ సొంత అవసరాలకు, పశువులు, ఇతర వాహనాలు, పలు వస్తువులను ఉంచుతున్నారు. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఆక్రమణకు గురైన పాఠశాలల భవనాలు

# ప్రభుత్వ వ్యతిరేక ఎజెండాపై పోరాడుదాం

**-ప్రజలకు మేమున్నామంటూ భరోసానిద్దాం**
**-తిరుపతినియోజకవర్గ టిడిపి శిక్షణతరగతుల్లో నేతలు**



తిరుపతి,నవంబర్ 23ప్రభాతవార్త: రాష్ట్రంలో మూడున్నరేళ్ళ వైసిపి ప్రభుత్వ పాలనలో అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలే ఎజెండాగా పోరాటం చేయాల్సిన అవసరం వచ్చింది, ఇందుకు ప్రతి నాయ కుడు, కార్యకర్త సైనికుడిలా సిద్ధంకావాలని తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మ, పార్లమెంట్ కమిటీ అధ్యక్షుడు నరసింహయాదవ్, జాతీయ,రాష్ట్ర పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ప్రభుత్వం తీసుకున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలు, ఎస్సీ,ఎస్టీ, బిసిల పట్ల చూపుతున్న వివక్షత, సంక్షేమం పేరుతో ప్రజలను మోసగిస్తున్న విధానంపై నేతలందరూ స్పష్టమైన అవగాహనతో ప్రజల ముందుకు వెళదామని సూచించారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చన్నాయుడు, ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ సూచనల మేరకు తిరుపతి నియోజకవర్గంలో టిడిపిని బరింత బలోపేతం చేయడం, ప్రజలతోనే ఉండి వారి సమస్యలపై పోరాటం చేయడం, సంక్షేమ పథకాలు అందకుంటే ప్రజలకు వివరించడం వంటి వాటిపై బుధవారం సాయంత్రం తిరుపతిలోని పార్టీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, బూత్‌కన్వీనర్లు, అనుబంధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, డివిజన్ అధ్యక్ష,కార్యదర్శులు, నగర కమిటీ నాయకులు అనుసరించాల్సిన విధానంపై శిక్షణ తరగతులు జరిగాయి. టిడిపి జాతీయ, రాష్ట్ర పార్టీ నాయకులు మబ్బు దేవ నారా యణరెడ్డి, సూరా సుధాకర్‌రెడ్డి, డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, పుష్పావతి యాదవ్, శ్రీధర్‌వర్మ, బుల్లెట్‌రమణ, డాక్టర్ బిఎల్ సంజ య్, రవినాయుడు, బిజి కృష్ణ యాదవ్, రామ్మూర్తి రాయల్, వట్టి కుంట శంకరనారాయణ, బ్యాంకు శాంతమ్మ, ముని రామయ్య, జగన్నాధం, వెంకీ, మునిశేఖర్ రాయల్, కుమారమ్మ, నగర పార్టీ నాయకురాళ్ళు కె.శాంతమ్మ, ఎస్. లత, ఎం.ఐషిమ్మ, మంజుల, లక్ష్మి, ఎన్.సుబ్బలక్ష్మి, బి.మంజుల, ఎస్.లక్ష్మీదేవి, మంజుల, సి.సు జాత, బి.రాధ, కల్పన, కె.ఈశ్వరి, ఎం.తరుణ, అధికార ప్రతినిధు లుగా కె.రేఖ, ఎ.గీత తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలను, ప్రజల సమస్యల పరిష్కారానికి అనుసరించాల్సిన వ్యూహంపై సుదీర్ఘంగా చర్చించారు. టిడిపి చేపట్టనున్న "ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి"పేరుతో ప్రజలు కూడా కలిసి నడవాలని, ఇందుకు 9261292612 నంబర్‌కు మిస్డ్‌కాల్ చేసి టిడిపి నేతలతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ప్రజలు తమతమ ప్రాంతంలో ఎదుర్కొనే సమస్యలను టిడిపి నాయకులకు తెలియజేయాలని, 14 ప్రశ్నలతో కూడిన ప్రశ్నాపత్రాన్ని ప్రజలకు అందజేసి పనితీరుపై సమాధానాలు రాబట్టేందుకు చూస్తున్నారు.

# ప్రమాదపు అంచున విద్యార్థులు

**-వర్షాలకు ఉరుస్తున్న తరగతి గదులు-పట్టించుకోని అధికారులు**



ఎర్రావారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం

ఎర్రావారిపాళెం, నవంబర్ 23 ప్రభాతవార్త : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పాఠశాల తరగతి గదులు ఉరుస్తున్న సంఘటన తిరుపతి జిల్లా ఎర్రావారిపాలెం మండలం బోడే వాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. ఎర్రావారిపాలెం మండలం బోడేవాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదులు ఉరుస్తు న్నాయి. దీనికి తోడు కరెంటు కనెక్షన్లు అలాగే ఉన్నాయి. ఓవైపు పాఠశాల భవనం ఎక్కడ కూలుతుందోఅని విద్యార్థులు భయాందోళనలు చెందుతున్నారు. మరోవైపు నీరు గోడలలోదిగి విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ అవుతుందో అని భయం భయంగా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని పాఠశాలకు వస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పాఠశాల భవనాన్ని తొలగించి నూతన భవనాలను ఏర్పాటు చేయాలని కోరారు.

## పేదల భూముల్లో...

# పెద్దల దర్జా!

**- భూకబ్జాలకు నిలయమైన ఓజిలి మండలం - భారీ ధరలకు అమ్మేసుకుంటున్న కేటుగాళ్లు**



ఓజిలి, నవంబర్ 23 ప్రభాతవార్త : ఓజిలి మండలం మనవాలి గ్రామంలో ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు మూడో కంటికి తెలియకుండా గుటుక్కుమని మింగేస్తున్నారు భూబకాసు రులు. మనవాలి గ్రామానికి పక్కనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీలు ఉండటం తో ప్రభుత్వ భూమి సైతం కోట్ల రూపాయలు పలుకుతోంది. కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్నా ప్రభుత్వ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తు న్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆ గ్రామంలో ఉన్న అడవి పోరంబోకు, గ్రామానికి చెందిన కొందరు కబ్జాదారులు చెరువును సైతం వదలకుండా వ్యవసాయం చేస్తున్నారని గ్రామప్రజలు అంటున్నారు. గతంలో రెవెన్యూ కార్యాల యంలో ఒప్పంద ప్రతిపాదనలపై విధులు నిర్వహించిన ఓ ప్రబుద్ధుడు, ఉన్నతాధికారి, సిబ్బంది మాయాజాలానికి మండలంలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయన్న ఆరోపణలు ఉన్నాయి. మండల కార్యాలయంలో జరిగిన మాయాజాలానికి ప్రభుత్వ భూములకు నకిలీ పాస్‌పుస్తకాలు, పట్టాలు చేయడం ఒక వంతయితే, డబ్బులు వసూలు చేయడం మరొక ఎత్తు. వీరికి మరో కొంతమంది వ్యక్తులను తోడు చేసుకొని తోటల వద్ద నకిలీ పాస్ పుస్తకాలకు సంబంధించి డబ్బులు వసూలు చేసే వారని సమాచారం. మండలంలోని సర్వేనంబర్ ఒకటిలో దాదాపు వేల ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయి. కుందాం, మనవాలి, ఆరిమేనుపాడు, మాచవరం, ముమ్మాయిపాలెం, గ్రద్దగుంట, కొండవల్లిపాడు, పెద్దపరియ, సగుటూరు, వీర్లగునపాడు తదితర గ్రామాల్లో నకిలీ పాస్‌పుస్తకాల ద్వారా సృష్టించిన ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదంతా మండల ప్రజలకు తెలుసు గాని ఇప్పటికి కూడా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టిన దాఖలాలు లేకపోవడం గమనార్హం. గతంలో ఓ ప్రబుద్ధుడి చేతులు తడిపితే చాలు ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న కబ్జాదారులకు పరోక్షంగా వీఆర్ఓలు సహాయ సహకారాలు అందించారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు స్పందించి ఒక కమిటీని ఏర్పాటు చేసి మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో ఆ సంవత్సరంలో విధులు నిర్వహించిన అధికారులతో పాటు ప్రస్తుతం ఉన్న అధికారులతో సమాచారం సేకరిస్తే మేలవుతుందని ఉన్నతాధికారులను మండల ప్రజలు కోరుతున్నారు.

## తుఫాను కూడా...

# ముసారతోనే సరిపెట్టింది



శ్రీకాళహస్తి,నవంబర్ 23 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి సత్యవేడు నియోజకవర్గాలు ఈ ఏడాది వర్షాభావంతో కుములు తున్నాయి.మూడు రోజుల పాటు తుఫాను గురించి ప్రకటనలు తప్ప ఆచరణలో రెండు రోజులుగా ముసారతోనే సరిపెట్టింది. ప్రస్తుతం ప్రకటించిన అల్ప పీడనం తుఫానుకు సంబం ధించి వాతావరణ శాఖ ముందు నుంచి అప్రమత్తం చేస్తుండటంతో అధికారులు పరుగులు తీసి చర్యలు తీసుకుంటున్నారు. కానీ వర్షాలే సమస్యగా మారింది. బుధవారం శ్రీకాళహస్తి మండల రెవెన్యూ కార్యాలయంలో 15.6 మిమీలు, తొట్టంబేడడులో 17.4 మి.మీలు వర్షపాతం నమోదైంది.ఈ నెల మొదటి వారమే బంగాళాఖాతంలో ఏర్పడ్డ తుఫాను సమృద్ధిగా వర్షం కురుస్తుందని భావించిన రైతులకు నిరాశ మిగిల్చింది. బుధవారం ఉదయం నుంచే వర్షం కురుస్తుంది. ఈ ఏడాది వర్షాలు అంతంత మాత్రంగా ఉంది. సాధారణ సగటు వర్షపాతం కూడా నమోదు కాలేదు.అక్టోబర్ నెల సాధారణ సగటు వర్షపాతం 232 మి.మీలు కాగా కేవలం 88 మి.మీలు మాత్రమే నమోదైంది.నవంబర్ సాధారణ సగటు వర్షపాత 332 మి.మిలు వర్షం కురవాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు 235.4మీ.మీలు నమోదు అయ్యింది.నెలలో మూడు భాగాలు పూర్తి అయ్యింది. అయితే సాధారణంగా ఇక్కడ నవంబర్ వర్షపాతం చివరి మూడు రోజుల్లో కురుస్తుంది. ప్రస్తుతం బంగాళా ఖాతంలో అల్పపీడనంతో వర్షాలని ప్రకటించారు.ఈ అల్ప పీడనం అయినా కాపాడుతుందనుకున్న అన్నదాతలకు నిరాశే మిగిల్చింది.

**స్వల్ప వర్షంతోనే రోడ్లు ఛిద్రం:**



శ్రీకాళహస్తి సత్యవేడు నియోజకవర్గాలో ఎటు చేసినా రోడ్లు ధ్వంస మయ్యాయి. శ్రీకాళహస్తిలోని ఏర్పేడు, శ్రీకాళహస్తి రూరల్, తొట్టం బేడు, సత్యవేడు నియోజకవర్గంలోని కెవిబిపురం మండలం, బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యా పాళెం, సత్యవేడు మండలాల్లో ఎటు చూసినా ధ్వంసమైన రోడ్లుతో వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని రోడ్లు ఛిద్రమైంది. నడవటానికి కూడా వీలు లేని దుస్థితి చోటు చేసుకుంది.ఇక ఏ గ్రామం రోడ్లు చూసినా ఏమున్నది గర్వకారణమన్నట్లు మారింది.

**అన్నదాతల అందోళన:**

శ్రీకాళహస్తి,సత్యవేడు నియోజకవర్గాల్లో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అక్టోబర్ మాసంలో సాధారణ సగటు వర్షపాతం నమోదు కాలేదు.దాంతో కొందరు నార్లు పోసుకోలేదు. మరి కొందరు నాట్లు వేయలేదు. ఈ నెల 8 వ తేది నుంచి అడపా దడపా వర్షాలు కురుస్తున్నాయి.కానీ సాధారణ సగటు వర్షపాతం కూడా నమోదు అవుతుందో లేదో అని ఆందోళన చెందుతున్నారు. దాంతో వ్యవసాయ పనులు స్థంభించాయి. నార్లు పోసుకున్న రైతులు నాట్లుకు అవకాశం లేకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక నాట్లుకు సిద్ధం చేసుకున్న పైరు మురిగిపోతున్నాయి.

# కార్ల దొంగతనాలకు పాల్పడిన నిందితుడు అరెస్టు

**- రూ.12 లక్షల విలువైన 3 కార్లు స్వాధీనం**

చిత్తూరు, నవంబర్ 23 ప్రభాతవార్త:
చిత్తూరు నగర పరిధిలో కార్ల దొంగతనాలకు పాల్పడుతున్న సంతపేట దర్గాకాలనీకి చెందిన యుగంధర్‌ను చిత్తూరు టుటౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. చిత్తూరులో కార్ల దొంగతనాలపై చిత్తూరు టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు రావడంతో ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నగర డిఎస్పీ శ్రీనివాసమూర్తి చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ నరసింహరాజు పర్యవేక్షణలో టుటౌన్ ఎస్ఐ మల్లికార్జున్, సిబ్బంది విచారణ చేపట్టారు. టుటౌన్ పోలీసులు బుధవారం కార్ల దొంగతనాలకు పాల్పడుతున్న యుగంధర్‌ను సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి అరెస్టు చేయడంతో డిఎస్పీ శ్రీనివాసమూర్తి బుధవారంఈకేసువిషయాలనువిలేకరులకువెల్లడించారు. చిత్తూరు సంతపేట దుర్గాకాలనీకి చెందిన యుగంధర్ అనతి భార్య డి.అనిత, అక్క వై.మంజులలుకలిసిసులభంగాడబ్బులుసంపాదించాలని నిర్ణయించి తమకు వున్న అప్పులను ఆ డబ్బులతో తీర్చివేయాలని భావించారు. ఈ



మేరకు యుగంధర్ చిత్తూరు నగర పరిధిలో తనకు తెలిసిన వారి కార్లకు బాడుగకు తీసుకొని తిరిగి ఆ కార్లకు వారికి అప్పగించకుండా కుదవ పెట్టడం లేదా అమ్మి డబ్బులు తీసుకోవడం చేసేవాడు. ఈ మేరకు చిత్తూరు సంతపేట బొజ్జయ్యనాయుడు కాలనీకి చెందిన టిఎస్ జనార్ధన్, చవటపల్లికి చెందిన సి.ఢిల్లీ, గంగనపల్లికి చెందిన ప్రసాద్‌లకు చెందిన మూడు కార్లను దొంగలించి వాటిని అమ్మడం కోసం మరొక చోట రహస్యంగా దాచిపెట్టాడు. అలాగే పెనుమూరు మండలం చిన్నకలికిరి గ్రామంకు చెందిన దిలీప్‌కుమార్ అనే వ్యక్తి దగ్గరు మరో రెండు కార్లను యుగంధర్ కుదవ పెట్టి అతని నుండి 6లక్షలరూపాయలు తీసుకొన్నాడు. ఆపై కుదవ పెట్టిన రెండు కార్లను యుగంధర్‌తీసుకొనిఅతనికితీసుకొన్నడబ్బులుఇవ్వకుండా వేధిస్తున్నాడు. కార్ల యాజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టుటౌన్ పోలీసులు యుగంధర్‌పై నిఘా వుంచి బుధవారం అరెస్టు చేశారు. అలాగే ఈ కేసులో నిందితులుగా వున్న యుగంధర్‌తో పాటు అతని భార్య డి.అనిత, సోదరి వై.మంజులలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డిఎస్పీ శ్రీనివాసమూర్తి వివరించారు. ఈ కేసులో యుగంధర్ దొంగలించిన మూడు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. ఈ కేసులో నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరచిన టుటౌన్ ఎస్ఐ మల్లికార్జున్, పిసిలు ధరణికుమార్, శివకుమార్, గోవిందరావు, కుమార్, డబ్ల్యుహెచ్ఓ హరితలను డిఎస్పీ శ్రీనివాసమూర్తి అభినందించారు.

## కార్మికులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి: చైర్‌పర్సన్

పలమనేరు,నవంబర్ 23 ప్రభాతవార్త:
పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్రమురళీక్రిష్ణ పేర్కొన్నారు. స్థానిక మెడికేర్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కరోనా సమయంలో వారి సేవలు అభినందదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చాంద్మా కమాల్, మున్సిపల్ కమీషనర్ కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన జిల్లా ప్రధాన కార్యదర్శి

పెద్దపంజాణి నవంబర్ 23 ప్రభాతవార్త :



రాష్ట్ర భూగర్భ గనులశాఖ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మండలంలోని రాయలపేటకు చెందిన వైకాపా జిల్లా ప్రధానకార్యదర్శి సుహేబ్ తిరుపతి మంత్రి స్వగృహం నందు మర్యాదపూర్వరంగా కలిసారు. ఈ సందర్బంగా ఆయన మండలంలోని వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. అలాగే చేపట్టవలసిన అభివృద్ధి పనులపై మంత్రికి నివేధిక అందించారు.

## వైభవంగా భగవాన్ శ్రీసత్యసాయి జన్మదిన వేడుకలు

చిత్తూరురూరల్, నవంబరు 23 ప్రభాతవార్త:



భగవాన్ శ్రీసత్యసాయిబాబా97వ జన్మదినోత్సవ వేడుకలను పట్టణంలోని గిరింపేట నందు వెలసిన శ్రీసత్యసాయి సేవాసదన్ నందు బుధవారం ఘనంగా నిర్వహించినట్లు సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మధుసూదనం, కన్వీనర్ శేషనారాయణలు తెలిపారు. ఉదయం 5.20గంటలకు ఓంకారం సుప్రభాతం, నగర సంకీర్తన, అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం ప్రభు త్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందున్న రోగుల సహాయకులకు, సంతపేట మాతృసేవా సమితి ఆశ్రమవాసులకు, సద్గురు ఆశ్రమ వాసులకు, డెనియల్ లెప్రసీ సెంటర్ వాసులకు సుమారు 900మందికి అన్నప్రసాదం అలాగే దీననారాయణులకు దుప్పట్లు పంపిణీ చేసారు.

## మామిడి పూత రక్షణతోనే దిగుబడి సాధ్యం

పలమనేరు,నవంబర్ 23 ప్రభాతవార్త:



మామిడి పూత,పిందె రక్షణతోనే అధిక దిగుబడి సాధ్యమని శాస్త్రవేత్త రామయ్య తెలిపారు. స్థానిక వెలుగు కార్యాల యంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడి పూత,పిందె దశలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మామిడి పూత దశ మొదలుకాబోతున్న తరుణంలో పూత దశలో చేపట్టవలసిన సస్యరక్షణపై అవగాహన కలిగిఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, ప్రిన్సిపల్ అండ్ హెడ్ కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్ అనంతరాజపేట, జిల్లా ఉద్యాన అధికారి డా. మధుసూదన్‌రెడ్డి, ఉద్యాన సహాయ సంచాలకులు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రధాన రహదారిలో ఎల్ఇడి లైట్ల ఏర్పాటు : చైర్మన్

కుప్పం, నవంబర్ 23 ప్రభాతవార్త :



కుప్పం పట్టణం పాతపేట చెరువు కట్ట నుంచి ఎంఆర్ రెడ్డి సర్కిల్, విజలాపురం సర్కిల్ వరకు చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ సూచనల మేరకు ఎల్ఇడి లైట్లను ఏర్పాటుచేయాలని మున్సిపల్ చైర్మన్ డా॥ సుధీర్ ఆదేశించారు. బుధవారం చైర్మన్ కమీషనర్ రవిరెడ్డితో కలసి ఆ ప్రాంతాలను పరిశీలించారు. రాత్రిపూట ఈ మార్గాల్లో లైట్లు లేకపోవడంతో ప్రజలు తీ వ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తమ దృష్టికి రావడంతో యుద్ధ ప్రాతిపదికన ఎల్ఇడి లైట్లను మున్సిపాలిటీ అధ్వర్యంలో ఏర్పాటు చేయాలని కమీషనర్‌ను ఆదేశించారు. ఈ లైట్లను రోడ్ డివైడర్లలో ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి డిఇ, మున్సిపల్ ఎఇ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఎన్ఎంయుఎ అధ్యక్షుడిగా మునస్వామి ఎన్నిక

కుప్పంరూరల్, నవంబర్ 23 ప్రభాతవార్త :



ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ కుప్పం డిపో అధ్యక్షుడిగా మునస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం యూనియన్ సమావేశం సంఘ గౌరవాధ్యక్షులు, మున్సిపల్ ఛైర్మన్ డా॥సుధీర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించారు. ఈసం దర్భంగా నూతన అధ్యక్షుడిగా మునస్వామిని ఎన్నుకున్నారు. అంతకుముందు మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం తాము అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్రనేతశ్రీకర్‌రెడ్డి, జిల్లాఛైర్మన్‌రాజా, జిల్లా అధ్యక్షుడు వేలు, జిల్లా కార్యదర్శి భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కుప్పం డిపో కార్యదర్శి జయపాల్, జిల్లా నేతలు ఏకాంబరం, నారాయణ, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్, రహంతుల్లా, ఉద్యోగులు పాల్గొన్నారు.

## మహిళలకు న్యాయం చేసింది చంద్రబాబే



**- దిశచట్టంతో ఒక్క ఆడపిల్లకైనా న్యాయం చేశారా?**
**- తెలుగుమహిళ అధ్యక్షురాలు**

కుప్పం, నవంబర్ 23 ప్రభాతవార్త :
రాష్ట్రంలో మహిళలకు న్యాయం చేసింది తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అని కుప్పం నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు అన సూయ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల సిఎం సభలో మహిళలు నల్ల రంగు చున్నీలుధరించి వస్తే వారిని అనుమానించి బయటకు పంపేయడం దారుణ మన్నారు. సిఎం సభలకు డ్రెస్‌కోడ్ ఏమైనా పెట్టారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రభుత్వం నీతి, న్యా యం, ధర్మంతో పనిచేయడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మహిళలకురక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా మహిళా నేత చంద్రకళ, కుప్పం మండల అధ్యక్షురాలు వసంతమ్మ, మహిళా నేతలు స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలపై అవగాహన సమావేశం

కుప్పం, నవంబర్ 23 ప్రభాతవార్త :
డిఆర్‌డిఎ పిడి ఆదేశాల మేరకు ఈనెల 25వతేది స్థానిక వెలుగు కార్యాలయంలో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలపై అవగాహన సమావేశంను నిర్వహిస్తున్నట్లు ఎపిఎం శ్రీనివాసమూర్తి తెలిపారు. పదవ తరగతి ఆపై చదువుకుని 18 -35 ఏళ్ల వయసు లోపు గల యువతీ యువకులు ఈ సమావేశానికి తమ సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 9398504955, ఎపిఎం 9390504662 నెంబరును సంప్రదించాలని కోరారు.

## అధికారులచే కొబ్బరితోటల పరిశీలన

శాంతిపురం, నవంబర్ 23 ప్రభాతవార్త :
జిల్లా ఉద్యానవన అధికారి మధుసూధన్ ఆదేశాల మేరకు మండలంలోని దొంకుమానిపల్లి రెవెన్యూ పరిధిలోని జనార్థనరెడ్డి అనే రైతుకు చెందిన కొబ్బరి తోటను ఉద్యానవన అధికారిణి డింపుప్రియశ్రీ పరిశీలించారు. ఈసందర్భంగా కొబ్బరి తోటలకు ఆశిస్తున్న తెల్లదోమ నివారణకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎఒ మనోజ్‌కుమార్, విఎఎ జయప్రకాష్, రాజేష్, రైతులు పాల్గొన్నారు.

## రేపు భూహక్కు, పంపిణీ కార్యక్రమం

చిత్తూరు, నవంబర్ 23 ప్రభాతవార్త:
వైఎస్ఆర్ జగనన్న భూహక్కు, భూపంపిణీ జిల్లా స్థాయి కార్యక్రమం శుక్రవారం చిత్తూరు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హరినారాయణన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ

# బంగారుపాళ్యం సిడిపిఓ ఆఫీసు తరలింపు

**- ప్రజాప్రతినిధులకు తెలియకుండానే అధికారుల నిర్వాకం**

బంగారుపాళ్యం, నవంబర్ 23 ప్రభాతవార్త:
మండల కేంద్రం బంగారు పాళ్యంలోని ఐసిడిఎస్ కార్యాలయం తరలింపు అధికారులు పూనుకొన్నారు. ఈ తరలింపు విషయంపై స్థానిక ప్రజాప్రతినిధులకు తెలయకుండానే అధికారులే గుట్టుచప్పుడు కాకుండా నిర్వహించి పూర్తి చేశారు. 53 లక్షల రూపాయల విలువైన ఐసిడిఎస్ కార్యాలయ భవనంను బంగారుపాళ్యంలో ఇది వరకే నిర్మించారు. కార్యాలయం తరలింపుతో ఈ భవనం పూర్తిగా నిరుపయోగం కానుంది. 1989లో బంగారుపాళ్యం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంను ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయం పరిధిలో బంగారుపాళ్యం, తవణంపల్లి, ఐరాల మండలాలకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాలు వస్తాయి. అప్పట్లో 163 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు కాగా ఈ కేంద్రాల పరిరక్షణకు బంగారుపాళ్యంలో సిడిపిఓ కార్యాలయంను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సిడిపిఓతో పాటు సూపర్‌వైజర్లు అంగన్



వాడీ కేంద్రాలను పర్యవేక్షిస్తూ చిన్నపల్లిలకు విద్యాబోధన చేసేవారు. ప్రస్తుతం బంగారుపాళ్యం మండలంను చిత్తూరు రెవెన్యూ డివిజన్ నుండి పలమనేరు రెవెన్యూ డివిజన్‌కు మార్పు చేశారు. ఇందులో భాగంగా బంగారుపాళ్యం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో వున్న మండలంలో వున్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను పలమనేరు ఐసిడిఎస్ పరిధిలోకి తీసుకువచ్చారు. మిగిలిన తవణంపల్లి, ఐరాల మండలాలతో యాదమరి మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంను కలుపుకొని నూతనంగా తవణంపల్లి కేంద్రంగా ఐసిడిఎస్ కేంద్రం ఏర్పాటుకు పూనుకొన్నారు. బంగారుపాళ్యం మండలంలోని 101 అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ఇకపై పలమనేరు ఐసిడిఎస్ పరిధిలోకి రానున్నారు. వీరు ప్రతినెలా జరిగే సమావేశాలకు ఇకపై పలమనేరుకు వెళ్ళాల్సి వుంటుం ది. గత 33 సంవత్సరాలుగా వున్న బంగారుపాళ్యం ప్రాజెక్టును అధికారులు విచ్ఛిన్నంచేశారు. బంగారుపాళ్యంప్రాజెక్టుతరలింపుపైస్థానిక ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం అధికారులు ఇవ్వలేదు. 2019లో బంగారుపాళ్యం ప్రాజెక్టు కోసం 53 లక్షల రూపాయల వ్యయంతో నూతన భవనంను నిర్మించింది. ఈ ప్రాజెక్టు పూర్తిగా తరలించడంతో ఈభవనంసైతంనిరుపయోగంకానుంది. ఇప్పటికైనాస్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి బంగారుపాళ్యంలోనే ఐసిడిఎస్ కార్యాలయం ఏర్పాటుకు పూనుకోవాల్సిన బాధ్యతు ఎంతైనా వుంది.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పగలే వెలుగుతున్న వీధిదీపాలు



ఓజిలి, నవంబర్ 23 ప్రభాతవార్త :
పాలకులు, విద్యుత్ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పెద్దపరియ గ్రామంలోని అరుంధతీ యవాడ కాలనీలో బుధవారం పట్టపగలే వీధిదీపాలు వెలుగుతూ దర్శనమిచ్చాయి. దీంతో విలువైన విద్యుత్ వృధా అవుతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీధి దీపాల నిర్వహణలో ఉన్న సమస్య లను పాలకులు, విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు విమర్శలుచేస్తున్నారు. మండలంలోనిపెద్దపరియగ్రామంలో వీధిదీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి.

## కట్టా సుధాకర్‌రెడ్డిని ఆశీర్వదించిన మంత్రి పెద్దిరెడ్డి

నాయుడుపేట, నవంబర్ 23 ప్రభాతవార్త :



విదేశీ పర్యటనలో భాగంగా అమెరికాకు వెళ్లనున్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కట్టా సుధాకర్‌రెడ్డిని రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీర్వదించారు. బుధవారం కట్టా సుధాకర్‌రెడ్డి తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. వీరి వెంట నాయుడుపేట మాజీ వైస్ ఎంపీపీ నల్లు కస్తూరయ్య, ఓజిలి మాజీ జడ్పీటీసీ సభ్యులు ముమ్మడి సుబ్బారావు ఉన్నారు.

## 50 ఎకరాల్లో వరి నాట్లు మునక

కోట, నవంబర్ 23 ప్రభాతవార్త :



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత రెండురోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా కోట మండలం అల్లంపాడు గ్రామ రైతులు వేసుకున్న వరినాట్లు నీటిపాలయ్యాయి. వంజివాక చెరువుకు వరద ప్రవాహం చేరడంతో ఆ గ్రామ రైతులు చెరువు కలుజుకు ఉన్న షట్టర్‌ను ఎత్తేయడంతో దిగువ భాగాన ఉన్న అల్లంపాడు రైతులు వేసుకున్న వరినాట్లు సుమారు 50 ఎకరాలు మునిగిపోయిందని అల్లంపాడు గ్రామ సర్పంచ్ ఈశ్వరరెడ్డి, ఉపసర్పంచ్ దేవరాల రాంబాబు చెప్పారు. వంజివాక రైతులు నీటిపారుదల శాఖ అధికారుల అనుమతి తీసుకోకుండా షట్టర్లు ఎలా ఎత్తుతారని ప్రశ్నిస్తున్నారు. దీంతో అల్లంపాడు రైతులే మళ్లీ వంజివాక చెరువు షట్టర్లను మూసేశారు. వంజివాక రైతులు నిర్లక్ష్యం కారణంగా తమ గ్రామానికి చెందిన 50 ఎకరాల వరినారు నీటిలో పాచిపోయిందని చెప్పారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

## కోటలో అస్తవ్యస్తంగా ట్రాఫిక్

కోట, నవంబర్ 23 ప్రభాతవార్త :



మండల కేంద్రమైన కోటలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. రోజురోజుకు జనాభా పెరుగుతున్నా అందుకు తగినట్లు రోడ్డు విస్తరణ కార్యక్రమం చేపట్టకపోవడంతో రోడ్లపైనే గంటలకొద్దీ ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీలు నిలిపేస్తున్నారు. గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఖచ్చితంగా పోలీసులు ట్రాఫిక్ విధులు నిర్వహించాల్సి ఉన్నా పూర్తిస్థాయిలో చేయడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. విధులకు వచ్చినా పోలీసులు షాపుల్లో ఉంటున్నారే గాని రోడ్డుపైన విధుల నిర్వహణలో ఉండటం లేదని విమర్శలు ఉన్నాయి. పోలీసులు ట్రాఫిక్‌పై పూర్తిస్థాయిలో శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

## అవసరమైనంత యూరియా అందుబాటులో ఉంచుతున్నాం

తడ, నవంబర్ 23 ప్రభాతవార్త :



రైతులకు అవసరమైనంత యూరియాను అందుబాటులో ఉంచుతున్నామని తిరుపతి జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం ఎడిఎ ధనుంజయరెడ్డి, సూళ్లూరుపేట ఎడిఎ నాగరాజులు పేర్కొన్నారు. బుధవారం వారు తడ మండలం గ్రద్దగుంట రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడ రైతులకు అందిస్తున్న యూరియా పంపిణీని పరిశీలించారు. ఆర్‌బికెలో ఉన్న రైతులతో మాట్లాడుతూ సున్నా వడ్డీ పంట రుణాలకు సంబంధించి ఖరీఫ్, రబీ రైతుల జాబితాలను ఇప్పటికే ప్రదర్శించామని చెప్పారు. వాటిని పరిశీలించి అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. వీరి వెంట విఎఎ కృష్ణ తదితరులు ఉన్నారు.

# చెరువు వేలంపాట నిర్వహించాలి : సర్పంచ్

వెంకటరెడ్డిపాలెం (ఓజిలి), నవంబర్ 23 ప్రభాతవార్త :
ఓజిలి మండలంలోని వెంకటరెడ్డి పంచాయతీ పరిధిలోని విజయ నెల్లూరు చెరువు వేలంపాటను పంచాయతీ పరిధిలోనే నిర్వహిం చాలని పంచాయతీ సర్పంచ్ కదిరి లలితమ్మ మండల పరిషత్ అధికారులను కోరారు. వెంకటరెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో 24వ తేదిన కొండవల్లిపాడు గ్రామంలో వేలంపాటను వాయిదా వేయాలని సర్పంచ్ కదిరి లలితమ్మ మండల పరిషత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వెంకటరెడ్డి పాలెం పంచాయతీ పరిధిలో వేలంపాట జరిగే చెరువుతో పాటు విజయ నెల్లూరు చెరువును కూడా పంచాయతీలోనే నిర్వహించాలని కోరా రు. గతంలో కూడా విజయ నెల్లూరు చెరువుకు సంబంధించిన చెరు వు వేలంపాటను వెంకటరెడ్డిపాలెం సచివాలయంలో జరిగిందన్నారు. అధికారులు దీన్ని దృష్టిలో ఉంచుకొని వెంకటరెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న చెరువులన్నింటికీ ఒకేరోజు వేలంపాట నిర్వహించాలని



వినతిపత్రం అందజేశారు. విజయనెల్లూరు చెరువు ఆయకట్టుదారులు చెరువు వేలంపాటను వాయిదా వేయాలని ఇన్‌ఛార్జ్ ఈఓపిఆర్‌డి ఎస్‌కె రిరాజ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువ నాయకులు బట్టాపృధ్వీకృష్ణయాదవ్, బట్టా అనిల్ యాదవ్ తదితరులు ఉన్నారు.

## శ్రీ అభయ శంకరునికి అమావాస్య పూజలు



సూళ్లూరుపేట, నవంబర్ 23 ప్రభాతవార్త :
సూళ్లూరుపేట పట్టణంలోని బ్రహ్మసూత్రం కలిగిన అభయశంకర దేవస్థానంలో కార్తీక మాసం అమావాస్యను పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేకంగా అలంకారం చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉభయదాత మోదుగుల విజయకుమార్ సహకారంతో ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

## తిరుపతి ఎంపీకి ఘనసన్మానం

సూళ్లూరుపేట, నవంబర్ 23 ప్రభాతవార్త :



సూళ్లూరుపేటలోని జైగణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తిరుపతి ఎంపీ మద్దెల గురు మూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట ప్రాంత అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమైన ఎక్స్‌ప్రెస్ రైళ్లను సూళ్లూరుపేటలో నిలిపేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బైరి పార్థసారధిరెడ్డి, కళత్తూరు శేఖర్‌రెడ్డి, బండి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాలను పరిశీలించిన ఎంపిడిఓ

వాకాడు, నవంబర్ 23 ప్రభాతవార్త :
మండలంలోని జమీన్ కొత్తపాలెం, దుగ్గరాజపట్నం పంచాయితీలలో సచివాలయాలను, సిబ్బంది పనితీరును బుధవారం ఆయన పరిశీలించారు. సచివాలయంలోని రికార్డులను ఎంపిడిఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ గోపినాథ్ మాట్లాడుతూ సచివాలయాలో పనిచేస్తున్న సిబ్బంది పనితీరుతో వాలంటీర్లకు తగు సూచనలు సలహాలు అందజేసారు. తుఫాన్‌పై ఎప్పటికప్పుడు వాలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని ఎంపిడిఓ గోపినాథ్ సూచించారు. ఆయన వెంట సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కమ్ముకున్న మేఘాలు.. అక్కడక్కడ చిరుజల్లులు

**- దొరవారిసత్రంలో 38.2 మిమీల వర్షపాతం నమోదు**

దొరవారిసత్రం, నవంబర్ 23 ప్రభాతవార్త :



బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా మేఘాలు కమ్ముకొని అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తున్నాయి. దొరవారిసత్రం మండలంలోని తీరప్రాంతాలైన వేలుకాడు, కారికాడు, మీజూరు, పూలతోట తదితర గ్రామాల్లో వర్షాలు తీవ్రంగా కురుస్తున్నాయి. దీనికితోడు దొరవారిసత్రంలో మంగళవారం సాయంత్రం 6 నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకు 38.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయ గణాంకాధికారి భక్తవత్సలం తెలిపారు. ఈ వర్షాలకు రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా మారారు. అయితే రెండోదఫా ఎరువులు వేయడానికి సిద్ధంగా ఉన్న అన్నదాతలకు ఎరువులు దొరక్క నానా అవస్థలు పడుతున్నారు. అందులో ప్రధానంగా నత్రజని (యూరియా) కోసం తిప్పలు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అన్నదాతలు పరుగులు తీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

## ఇదేం ఖర్మ ప్రచారం 45 రోజుల

కోట,నవంబర్ 23 ప్రభాతవార్త :
రాష్ట్ర ప్రభుత్వ దుర్మార్గాల, అవినీతి, అక్రమాలు, కక్షసాధింపు, చట్టాలు ఉల్లంఘన, అధిక ధరలు, ఆర్టీసీ ఛార్జీలు వడ్డన కార్పోరేషన్ల ద్వారా రాయితీ రుణాలు అందక పోవడం రూ లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రం సర్వనాశనమై పోవడంతో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అంటూ ప్రజలు తలబాదుకునే పరిస్థితి ఏర్పడిందని మండల తెదేపా నాయకులు కె.మధసూదన్‌యాదవ్ అన్నారు. ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ ఇదేం ఖర్మ అంటూ 45 రోజుల ప్రచారం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ దుర్మార్గాలను కట్టడి చేసేలా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లాలో 45 రోజుల కార్యక్రమాలను చేయనున్నట్లు చెప్పారు. మరో ఏడాదిన్నలో ప్రజలుకు మంచిరోజులు వస్తాయన్నారు.

## పెయింట్ వేశారు.. బోర్డు మరిచారు

దొరవారిసత్రం, నవంబర్ 23 ప్రభాతవార్త :



గత ఆరునెలల క్రితం మండల గ్రాంట్ ద్వారా పాత భవనాలకు పెయింట్లు వేశారు. అయితే పెయింట్లు మాత్రమే వేశారు గాని ఆయా కార్యాలయాల పేర్లు మాత్రం ఏర్పాటు చేయకపోవడంతో ఏ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియక ప్రజలు అవస్థలు తప్పడం లేదు. దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయాలకు మండల గ్రాంట్ ద్వారా సున్నాలు కొట్టించారు. అయితే సున్నాలు మాత్రమే వేయించారు గాని అక్కడ ఏ కార్యాలయం ఎక్కడ ఉందనే బోర్డు మాత్రం ఏర్పాటు చేయకపోవడంతో అధికారుల నిర్లక్ష్యం తెలుస్తోంది. దీనికి తోడు ప్రతి కార్యాలయంలో సమాచార చట్టం బోర్డులు కూడా ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే కార్యాలయం పేర్లే నమోదు చేయలేదని ఇక చట్టాలు తెలియజేసే బోర్డులు ఏర్పాటు చేస్తారా అని పలువురు విమర్శలు చేస్తున్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి మండల స్థాయి అధికారులు ఈ కార్యాలయాలకు వస్తున్నారా లేదా అనే విషయం కూడా అర్థం కాక అయోమయ పరిస్థితి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## గ్రామాల అభివృద్ధి సిఎం జగన్‌కే సాధ్యం

చిల్లకూరు నవంబర్ 23 ప్రభాతవార్త :
గ్రామాల అభివృద్ధి చేయడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని బోధనం, రెట్టపల్లి గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతు అభివృద్ధి పథకాలు పొందిన వారికి ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలు అందచేయడం జరిగిందని అన్నారు. అదే విధంగా ఆయా గ్రామాలలో ఎక్కువగా త్రాగునీరు, సిసిరోడ్లు డ్రైనేజి వీధిదీపాలు కావాలని నాయకులు తమ దృష్టికి తీసుకొని రావడం జరిగిందని వెంటనే పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. ఈకార్య క్రమంలో జడ్‌పిటిసి మన్నెం శ్రీనయ్య, తహసిల్దారు జి స్వర్ణ, ఎంపిటిసిలు జానకిరామ్, బాలిపాక సుజాత, సర్పంచ్‌లు పారిచర్ల నాగలక్ష్మీ, పారిచర్ల కోటమ్మ, నాయకులు కన్వీనర్ పరంధామరెడ్డి, కనపర్తి దిలీప్‌కుమార్‌రెడ్డి, కట్టా రవీంద్రరెడ్డి, రమేష్‌రెడ్డి, ఇఒఆర్‌డి మాణిక్యం, ఏఇలు, పంచాయితీ కార్యదర్శులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 30న అమరావతిలో ఉపాధ్యాయుల ధర్నా

కోట,నవంబర్ 23 ప్రభాతవార్త :
ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న అమరావతిలో ధర్నా చేపట్టనున్నట్లు కోట మండల యూటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మువ్వల మనోహర్ చెప్పారు. ఆయన బుధవారం కోటలో విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమది ఫ్రెండ్లీ ప్రభుత్వం అని ప్రచారం చేసుకొవడమే తప్ప ఎలాంటి ఉపయోగం లేదన్నారు. జీపీఎస్ విధానం ఆమోదయోగ్యమైనది కాదని స్పష్టం చేశారు. ఈనెల 30 న అమరావతిలో పెద్ద ఎత్తున్న నిరసన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సంక్షేమ పథకాల పేరిట ప్రతి నెలా ప్రజలకు వేలాది కోట్లు చెల్లిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలల్లో భాగమే అన్న సంగతి మరిచిపోయ్యారన్నారు.

## దళిత సమరభేరి జరిపి తీరుతాం

తవణంపల్లె, నవంబర్ 23 ప్రభాతవార:
తిరుపతి నగరంలో గురువారం నిర్వహించ తలపెట్టిన దళిత సమరభేరి కార్యక్రమంను ఎట్టి పరిస్థితుల్లోనూ జరిపి తీరుతామని రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రం తవణంపల్లెలో అంబేద్కర్ విగ్రహం ముందు దళిత సమరభేరి కరపత్రాలను మండల టీడీపీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి పట్టణంలో పోలీస్ యాక్ట్ 30 అమలులో వున్నా దళిత సమరభేరి కార్యక్రమంను జరిపి తీరుతామని తెలిపారు. ఈకార్యక్రమంకు టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈసందర్బంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలే వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి జొన్నగురకల మధుకుమార్, నాయకులు వినాయక, చిట్టెమ్మ, వెంకటస్వామి, రాజేష్ చౌదరి, నాగరాజు, చంద్రబాబు, డిలీకుమార్, శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తొట్టంబేడు ఐసిడిఎస్ ప్రాజెక్టు మార్పు నిలిపాలి!

తొట్టంబేడు, నవంబర్ 23 ప్రభాతవార్త :
తొట్టంబేడు ఐసిడిఎస్ ప్రాజెక్టును మార్చడం ఆపాలని ఐఎఫ్‌టియు డిమాండ్ చేసింది. తొట్టంబేడు ఐసిడిఎస్ ప్రాజక్టును పిచ్చాటూరు ప్రాజెక్టుకు మార్చడాన్ని వ్యతిరేఖిస్తున్నామని ఏపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఐఎఫ్‌టియు అనుబంధం జిల్లా అధ్యక్షురాలు జి.భారతీ ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. తొట్టంబేడు నుంచి పిచ్చాటూరు ప్రాజెక్టుకి సమావేశాలకు వెళ్ళాలంటే సుమారు 40 నుంచి 50కి.మీ దూరం వరకు ఉంటుందని ఇది మహిళలకు ఎంతో ఇబ్బందిగా ఉంటుందన్నారు. అంగన్‌వాడీ మహిళలు ఇబ్బంది పడకుండా ఉండడానికి ప్రయత్నం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు

## అమావాస్య రోజు కార్తీక దీపం ఆవిష్కరణ

శ్రీకాళహస్తి, నవంబర్ 23 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం చివరి రోజు అమావాస్య సందర్భంగా బుధవారం భక్తి శ్రద్ధలతో ఆకాశ దీపాన్ని ఆవిష్కరించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆకాశదీపాన్ని, వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా ఆవిష్కరించారు. ఆలయ పొరోహితులు అర్థగిరి స్వామి వేదమంత్రాలను పఠిస్తుండగా భక్తి శ్రద్ధలతో ఆకాశ దీపాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో టెంపుల్ ఇన్స్ పెక్టర్ శ్రీనివాసరాజు, చందు ఇఒ సిసి హరి, దఫేదార్ దాము తదితరులు పాల్గొన్నారు.

## నాన్ కేడర్ ఎస్పీగా సుప్రజా పదోన్నతి

తిరుపతి క్రైం, నవంబర్ 23 ప్రభాతవార్త :
తిరుపతి జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన)గా పనిచేస్తున్న ఇ.సుప్రజ ఎస్పి (నాన్‌కేడర్) పదోన్నతి పొందారు. ఆమెను అవినీతి నిరోధకశాఖ జాయింట్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. బుధవారం 21మంది అదనపు ఎస్పీలకు ఎస్‌పిగా పదోన్నతి కల్పించి పోస్టింగ్‌లిచ్చారు. తిరుపతిలో అదనపు ఎస్‌పి సుప్రజను ఏసిబికి, ఎర్రచందనం పరిరక్షణ టాస్క్‌ఫోర్స్‌లో ఉన్న ఎస్‌పి ఎం.సుందర్‌రావును అక్కడ నుంచి బదిలీచేస్తూ ఇంటెలిజెన్స్ విభాగంకు పోస్టింగ్ ఇచ్చింది. ఈ ఉత్తర్వులు అందుకున్న వాళ్ళు ఆయా విభాగాల్లో రిపోర్టుచేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.

## వేడుకగా చండికేశ్వరస్వామి హోమం



తిరుపతి, నవంబర్ 23ప్రభాతవార్త:
కార్తీకమాస హోమాల్లో భాగంగా బుధవారం ఉదయం కపిలేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా చండీకేశ్వరస్వామి హోమం జరిగింది, కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవార్ల సమక్షంలో చండికేశ్వరస్వామి హోమం, పూజలు అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

## పాతజ్ఞాపకాలను నెమరువేసుకుంటూ

– రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డిని కలసిన ఎన్‌బి

తిరుపతి, నవంబర్ 23ప్రభాతవార్త:



కాంగ్రెస్‌పార్టీలో తనను ప్రోత్సహించి, పార్టీలో చేరేలా, యువజనకాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమించడానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డితో టిడిపి రాష్ట్ర అధికారప్రతినిధి డాక్టర్ ఎన్‌బి సుధాకర్‌రెడ్డి పాతజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చాలాకాలం తరువాత సుధాకర్‌రెడ్డి రాజకీయ గురువు రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డిని బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. 2003లో అలిపిరి వద్ద జరిగిన బాంబు దాడిలో గాయపడిన తరువాత రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డి రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తన వ్యక్తిగత జీవితంలో రెడ్డివారి ప్రభావం కీలక మలుపులకు కారణమైందని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. 1983వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకు అటు కాంగ్రెస్ పార్టీలో, ఇప్పుడు టిడిపి వరకు తన రాజకీయ ప్రస్థానాన్ని ఇరువురూ ఆప్యాయంగా చర్చించుకున్నారు. ప్రస్తుతం పిఆర్‌ఎస్‌ఐలో కూడా కీలకంగా ఎన్‌బి కొనసాగుతున్నారు. 2020లో టిడిపిలో చేరిన అంశం, ప్రస్తుతం పార్టీలో కీలకంగా అధికారప్రతినిధిగా వ్యవహరిస్తున్న తీరుపై చర్చించుకున్నారు.

## జ్ఞానప్రద వెంకన్న ఆలయంలో..కార్తీకదీపోత్సవం

తిరుపతి(క్రీడ), నవంబర్ 23ప్రభాతవార్త:



ఎస్వీయూనివర్సిటీ ఆవరణలోని జ్ఞానప్రద శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం కార్తీకమాస దీపోత్సవం వేడుకగా నిర్వహించారు. రాయలసీమ రంగస్థలి కళాసంస్థ చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, అర్చకులు వాసుదేవస్వామి, ఆలయ ఇన్‌చార్జి శ్రీనివాసులు, ప్రవచనకర్త గరికపాటి రమేష్‌బాబు, సిరిగిరి రమేష్, విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొని స్వామివారి చెంత దీపోత్సవం వెలిగించారు. భక్తులందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు.

## రేపు న్యాయవాద సంఘ ఎన్నికలు

చిత్తూరు, నవంబర్ 23 ప్రభాతవార్త:
చిత్తూరు న్యాయవాద సంఘ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం అయ్యింది. చిత్తూరు పాత కోర్టు ప్రాంగణంలోని న్యాయవాదుల సంఘ భవనంలో శుక్రవారం న్యాయవాదుల సంఘ ఎన్నికలు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఎన్నికల పోలింగ్ పూర్తయిన అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఓట్లు లెక్కించి గెలుపొందిన అభ్యర్థులను ఎన్నికల అధికారి యోగానంద్ ప్రకటించనున్నారు. చిత్తూరు న్యాయవాద సంఘ ఎన్నికల్లో 353 మంది న్యాయవాదులు ఓటు హక్కును కలిగి వున్నారు. ఇప్పటికే ఈ ఎన్నికలకు సంబంధించి నాలుగు పదవులు ఏకగ్రీవం అయ్యాయి. సంయుక్త కార్యదర్శి లీలా మనోహర్‌నాయుడు, సాంస్కృతిక కార్యదర్శిగా వి.దేవరాజులు నాయుడు, రెండు కార్యవర్గ సభ్యుల పదవులు ఏకగ్రీవం అయ్యాయి. కార్యవర్గ సభ్యులుగా కె.గోమతి, వి.సురేష్‌బాలులు ఏకగ్రీవం అయ్యారు. మిగిలిన పదవులకు శుక్రవారం ఎన్నికల పోలింగ్ జరుగనుండటంతో ఎన్నికల్లో పోటీలో వున్న అభ్యర్థులు ఓట్ల కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

## వరిసాగులో నూతన వంగడాలు

బంగారుపాళ్యం, నవంబర్ 23 ప్రభాతవార్త:



రబీ సీజన్‌లో వరిసాగు నందు నూతన వంగడాలను రైతులు పండించాలని జిల్లా వ్యవసా య శాఖ అధికారి జె.మురళీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో వరి పంటలో చేపట్టాల్సిన పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులు తక్కువ నీటితో ఎక్కువ పంట సాగు చేపట్టేలా యాజమాన్య పద్ధతులను ఉపయోగించాలన్నారు. అలాగే సేంద్రీయ ఎరువుల వాడకం వల్ల అధిక దిగుబడి పొందవచ్చునన్నారు. భూసార పరీక్షలను రైతులు క్రమం తప్పకుండా చేపట్టి దానికి అనుగుణంగా పంటలను సాగు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిఆర్‌సి కోఆర్డినేటర్ గోపాల్, ఎడిఎలు నాగపద్మిని, ఉమా, ఎఒలు లక్ష్మీప్రసన్న, వేణుగోపాల్, నాగరాజు, శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్, బంగారుపాళ్యం ఎఒ చిట్టిబాబు, ఆర్‌బికె సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో గ్రంథాలయ వారోత్సవాలు

తిరుపతి (విద్య), నవంబర్ 23 ప్రభాతవార్త :



శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పిజి కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలను కళాశాల ప్రిన్సిపల్ డా. కె. మహదేవమ్మ ఆధ్వర్యంలోనిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థినులు లైబ్రరీకి వచ్చి పుస్తకాలను చదివి మానవతా విలువల్ని, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా టిటిడి శ్వేత డైరెక్టర్ ఏ. ప్రశాంతి మాట్లాడుతూ గ్రంథాలయం విజ్ఞాన భాండాగారమని, వ్యక్తిత్వ వికాస నిలయమని తెలిపారు. పుస్తకాలను చదివేందుకు ఆసక్తి ఉంటే విజయం మీ వెంటే వుంటుందని తెలిపారు. ఏ ప్లస్ గ్రేడ్ సాధించిన శ్రీ పద్మావతి కళాశాలలోని అధ్యాపకుల్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థినులు అభ్యున్నతికి పాటు పడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆచార్య రఘుపతి, కోఆపరేటివ్ ఎంప్లాయిస్ బ్యాంకు డైరెక్టర్ హేమలత, లైబ్రరీ నోడల్ ఆఫీసర్ కెపి పద్మజ, సి. భువనేశ్వరీ దేవి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విద్యుల్లత, వార్డన్ భద్రమణి, నీరజ, మమత, స్వర్ణలత, జయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## దిశ ఫిర్యాదులపై అప్రమత్తంగా వుండాలి : డిఎస్పీ

విజయపురం, నవంబరు 23 ప్రభాతవార్త :



దిశ ఫిర్యాదులపై అప్రమత్తంగా వుండాలని డిఎస్పీ రవికుమార్ తెలిపారు. బుధవారం విజయపురం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిశలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికపుడు పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చే వారితో, ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. మహిళా చట్టాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైసిపి నాయకులు శివరాజు, సుధాకర్‌రాజు డిఎస్పీని శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమం లో సిఐ రాజశేఖర్, ఎస్ఐ నరేష్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎపిఐఐసి భూములను పరిశీలించిన కలెక్టర్

విజయపురం, నవంబరు 23 ప్రభాతవార్త :
మండలంలోని ఎపిఐఐసి భూములను కలెక్టర్ హరినారాయణ్ పరిశీలించారు. బుధవారం కోసలనగరం, మహారాజపురం గ్రామాల్లో ఎపిఐఐసి భూములను పరిశీలించి భూసేకరణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొదటి విడత సేకరణలో ఏ భూములు ఏ దశలో వున్నాయని అడిగారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

## పోలీసు స్టేషన్‌ని డియస్‌పి రవికుమార్ తనిఖీ

నింద్ర, నవంబరు 23 ప్రభాతవార్త :



నింద్ర పోలీసు స్టేషన్‌ను నగరి సబ్ డివిజన్ డియస్‌పి రవికుమార్ బుదవారం తనిఖీ చేసారు. ఈసందర్భంగా పోలీసు స్టేషన్‌లో రోజువారి జరుగు కార్యక్రమాలు, రికార్డులు గురించి నగరి రూరల్ సిఐ రాజశేఖర్‌ను, నింద్ర యస్ఐ వెంకటసుబ్బమ్మను అడిగి తెలుసుకున్నారు. మండలానికి మొట్టమొదట విచ్చేసిన డియస్‌పి రవికుమార్‌ను యంపిపి దీపాజలంధర్ రాజు, వైకాపా మండల కన్వీనర్ వేణురాజు, వైకాపా రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, కో ఆప్షన్ మెంబరు అనిల్‌కుమార్, యంపిటిసి విజేష్, నాయకులు బాబురెడ్డి, వీరయ్యనాయుడు, రామచంద్రారెడ్డి, సెల్వంరెడ్డి, దినకర్ తదితరులు పాల్గోన్నారు.

## జిల్లా సమీక్ష సమవేశానికి సమగ్ర నివేదికలు సిద్ధం చేయండి

–జిల్లా అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకట రమణారెడ్డి

తిరుపతిరూరల్, నవంబర్23 ప్రభాతవార్త:



ఈనెల 26న జరగబోయే జిల్లా సమీక్ష సమావేశానికి సమగ్ర నివేదికలు సిద్దం చేయాలని జిల్లా అధికారులకు కలెక్టర్ వెంకట రమణారెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఈ నెల 26న జరిగే జిల్లా సమీక్షకు ముందస్తుగా అధికారులతో సమావేశం నిర్వహించి, దిశా నిర్ధేశం చేసారు. ఈ సమీక్షలో గౌరవ మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరైతారని, గతంలో డి.ఆర్.సి.లో చర్చించబడిన అంశాలపై తీసుకున్న చర్యలను నివేదించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ప్రణాళిక అధికారి అశోక్‌కుమార్, ద్వామా పి.డి. శ్రీనివాసప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ విజయకుమార్, సర్వే ఏడి జయరాజ్, డిఆర్‌డిఎపి.డి.జ్యోతి, మెప్మాపి.డి.రాధమ్మ, హౌసింగ్‌పి.డి.చంద్రశేఖర్‌బాబు, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ శంకర్‌నారాయణ, ఇరిగేషన్ అధికారులు, డిఎంహెచ్ఒ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## 25న పట్టుబడిన వాహనాలు బహిరంగ వేలం

తిరుపతిరూరల్, నవంబర్23 ప్రభాతవార్త:
స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తిరుపతి అర్బన్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన 10 వాహనాలను ఈనెల 25న బహిరంగ వేలం వేయబడునని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలిచినవాళ్ళు 25న ఉదయం 10:30గంటలకు ఎస్‌ఇబి స్టేషన్‌కు చేరుకోవాలన్నారు. ఇతర వివరాలకు తిరుపతి అర్బన్ ఎస్‌ఇబి స్టేషన్ నందు సంప్రదించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజారెడ్డి తెలిపారు.

## డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన వైసీపీ నేతలు

నాయుడుపేట, నవంబర్ 23 ప్రభాతవార్త :
నాయుడుపేట డీఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాజగోపాల్‌రెడ్డిని వైసీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వైసీపీ సీనియర్ నాయకులు తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, మాజీ ఎఎంసి డైరెక్టర్, ప్రముఖ కాంట్రాక్టర్ నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నాయుడుపేట డివిజన్ పరిధిలోని పలు అంశాలపై వారు చర్చించారు.

## సత్యసాయిబాబా విగ్రహం ఊరేగింపు

శ్రీకాళహస్తి, నవంబర్ 23 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తిలోని సత్యసాయి బాబా సేవా సమితి సారధ్యంలో బుధవారం రాత్రి భక్తుల భజనలతో గ్రామోత్సవం నిర్వహించారు. ముత్యాలమ్మగుడ డివీధిలోని సాయి మందిరం నుంచి సాయి భక్తులు భజనలు చేస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. నాలుగుమాడావీధుల్లో ప్రజలకు ప్రసాదాలను వితరణ చేస్తూ గ్రామోత్సవం సాగించారు. ఓ వైపు పెద్దల భజనలు, మరో వైపు కోలాటాలు, చిన్నారుల నృత్యప్రదర్శనలతో సాగింది, పాటల్లో సాయిబాబా సమాజిక సేవలు స్మరిస్తూ ముందుకు సాగారు. ఉత్సవాలను నిర్వాహకులు పాండురంగయ్య సారథ్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

## ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జికి పదోన్నతి

శ్రీకాళహస్తి, నవంబర్23 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తిక్షేత్రంలో పనిచేయ దం పూర్వజన్మ సుకృతం అని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి రాఘవేంద్ర అన్నారు. పుత్తూరు సీనియర్ సివిల్‌జడ్జిగా పదోన్నతి పొందిన ఆయనకు బుధవారం కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్‌జడ్జి బేబిరాణి, అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి నరేంద్రరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాడుపూరు ప్రసాద్ తదితరులు ఆత్మీయ సన్మానసభను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పదోన్నతిపై వెళ్తున్న జడ్జి రాఘవేంద్ర మాట్లాడుతూ తన తండ్రి న్యాయమూర్తిగా ఉన్నపుడు తాను జూనియర్ సివిల్‌జడ్జిగా పనిచేసేటపుడు తన తండ్రి వద్ద ఎన్నో విషయాలు నేర్చుకున్నానని పాతజ్ఞాపకాలను గుర్తుతెచ్చుకున్నారు. సీనియర్ సివిల్‌జడ్జి బేబిరాణి మాట్లాడుతూ రాఘవేంద్ర పదోన్నతిపై వెళ్ళడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం బదిలీపై వెళ్తున్న జడ్జిని దుశ్శాలువతో సత్కరించి స్వామిఅమ్మవార్ల మెమొంటోను అందించారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్‌సివిల్‌జడ్జి నరేంద్రరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ప్రసాద్, కోర్టుసిబ్బంది పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## జాడ లేని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు

కేవీబీపురం, నవంబరు 23 ప్రభాతవార్త:
మండలంలో ప్రతి నెల జరగవలసిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ, పౌర హక్కుల సమావేశాలు కేవీబీ పురం మండలంలో జాడలేదని దళిత నాయకుడు సూరిపాకు వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేవీబీ పురం మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో జస్టిస్ పున్నయ్య కమిటీ ఆదేశాల మేరకు ప్రతి నెల ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ, పౌర హక్కుల సమావేశాలు నిర్వహించి ఎస్సీ, ఎస్టీల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడం కొరకు పున్నయ్య కమిటీ ఈ నివేదికను మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించడం లేదన్నారు. గత సమావేశంలో దిగువ పుత్తూరు గ్రామంలో దళితులకు శ్మశాన వాటికకు దారి లేదని ఆ సమస్యను పరిష్కరించాలని మానిటరింగ్ కమిటీలో తెలియజేసినా ఇంత వరకు పరిష్కరించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ, పౌర హక్కుల సమావేశాల్లో ఏవైనా సమస్యలు తెలియజేస్తే 30 రోజుల్లోనే ఆ సమస్యను పరిష్కరించే విధంగా చట్టం ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నత స్థాయి అధికారులు స్పందించి మండలంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించి ఎస్సీ, ఎస్టీ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## లోతట్టు ప్రాంతాలపై వీఆర్‌వోలు అప్రమత్తంగా ఉండాలి : తహశీల్దార్

కేవీబీ పురం, నవంబరు 23 ప్రభాతవార్త:
అల్పపీడనం తుపాను ప్రభావంతో లో తట్టు ప్రాంతాలపై అప్రమత్తంగా ఉండాలని సంబంధిత గ్రామ వీఆర్‌వోలకు మండల తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి ఆదేశించారు. మండల కేంద్రమైన కేవీబీ పురంలో బుధవారం మధ్యాహ్నం వీఆర్‌వోలతో అల్పపీడనం తుపాను పీడిత ప్రాంతాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మునిరత్నం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోనాటి సుబ్రహ్మణ్య యాదవ్, అసిస్టెంట్ ఆఫీసర్, వీఆర్‌వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

## సిరుగురాజుపాళెంలో ఆధార్ సేవలు

పుత్తూరురూరల్, నవంబరు 23 ప్రభాతవార్త:
పుత్తూరు మండలంలోని సిరుగురాజుపాళెం పంచాయతీ ప్రజలకు సౌకర్యంగా బుధవారం ఆధార్ సేవలను అందించారు. ఈ సందర్భంగా పంచాయతీలోని విద్యార్థుల ఆధార్, బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేశారు. అలాగే ఆధార్‌లోని తప్పులను, చిరునామాలు మార్పులను, కొత్తగా ఆధార్ కార్డులను పొందేందుకు అవకాశం కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మురళి, పంచాయతీ కార్యదర్శి హరిత, వెల్ఫేర్ అసిస్టెంట్ హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## క్యాట్ పరీక్షల్లో శ్రీ చైతన్య విద్యార్థుల విజయం

పుత్తూరురూరల్, నవంబరు 23 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి క్యాట్ పరీక్షల్లో 170 మంది విద్యార్థులకు గాను 72 మంది సెకండ్ లెవెల్‌లోకి అర్హత సాధించి నట్లు ప్రిన్సిపాల్ రవికిరణ్ తెలిపారు. ప్రిన్సి పాళ్లు రవికిరణ్, శరవణ, అకాడమిక్ డీన్ తిరునావకరుసు, పది ఇన్‌చార్జి యోగేశ్వరి, రూప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 26న పుత్తూరులో జిల్లా స్థాయి కౌశల్ క్విజ్‌పోటీలు

పుత్తూరురూరల్, నవంబరు 23 ప్రభాతవార్త:



ఈ నెల 26వ తేదీన పుత్తూరులోని శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో తిరుపతి, చిత్తూరు ఉమ్మడి జిల్లాల జిల్లా స్థాయి కౌశల్ క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా కో-ఆర్డినేటర్ లత, ఆర్గనైజింగ్ మెంబర్స్ సౌజన్య, కల్పన తెలిపారు. ఈ మేరకు జిల్లా స్థాయి పోటీల నిర్వహణకు జిల్లా విద్యాశాఖ అధికారి డా. శేఖర్‌ను కలసి వారు ఆహ్వానించారు.

## విద్యార్థినులు ధైర్య సాహసాలతో ముందుకెళ్లాలి

పుత్తూరురూరల్, నవంబరు 23 ప్రభాతవార్త:



విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని, ధైర్య సాహసాలతో ముందుకెళ్లాలని పుత్తూ రు మండల అధ్యక్షురాలు మునివేలు సూచించారు. బుధవారం పుత్తూరు మండలం వేపగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో గుడ్ టచ్- బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గుడ్ టచ్- బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. పాఠశాల కమిటీ చైర్మన్ నరసింహులు, సీఆర్పీ సిద్ధయ్య, మహిళా పోలీస్ ప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తెదేపా దళిత భేరిని జయప్రదం చేయాలి

యర్రావారిపాలెం, నవంబరు23 ప్రభాతవార్త
ఈనెల 24న తిరుపతిలో జరుగబో యే తెదేపా దళిత భేరి కార్యక్రమా న్ని జయప్రదం చేయాలని



చిత్తూరు పార్లమెంటు తెదేపా ఉపాధ్యక్షులు పులిచెర్ల మహేష్ అన్నారు. బుధవా రం యర్రావారి పాలెంలో విలేకరులతో మాట్లాడుతూ దళితుల సమస్యలు, దళితులకు సంబంధించిన27రకాలస్కీములురద్దుపరచుట, ఎసీ ్ర ఎస్టీ అట్రాసిటీనిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు పరచకపోవడం, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ రద్దు, ఎస్సీఎస్టీల రుణాలు నిలిపి వేయడం, భూమి కొనుగోలు పథకాన్ని రద్దు చేయడంవంటివి ఈ ప్రభుత్వం వచ్చాక జరిగాయన్నారు. ఈమేరకు దళిత భేరికి హాజరు కావాలని ఇంటింట ప్రచారం నిర్వహించారు.

## బాలిక మృతి పట్ల ఎంఎల్‌ఏ విచారం



చంద్రగిరి, నవంబర్ 23 ప్రభాతవార్త:
స్థానిక కొత్తపేట, ఆకుతోట వీధికి చెందిన సిహెచ్ నాగేశ్వరరావు కుమార్తె చిన్నారి పవనశ్రీ (8) మృతి పట్ల ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్ ఒడ్డి విచారం వ్యక్తం చేశారు. దీపావళి పండుగ రోజున భాణాసంచా వెలిగిస్తుండగా ప్రమాదవశాత్తు దుస్తులకు నిప్పంటు కోవడంతో బాలిక తీవ్రగాయాలకు గురై వేలూరు సిఎంసిలో వైద్య చికిత్సలు పొందుతూ మరణించింది. బుధవారం బాలిక మృతి విషయం తెలుసుకున్న ఎంఎల్‌ఏ బాలిక తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. తక్షణం తనవంతుగా ఆర్థిక సాయంతో ఓదార్పు కలిగించారు. ఈ మేరకు ఎంపిపి హేమేంద్రకుమారెడ్డి, ముద్దికుప్పం రూప రామమూర్తి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంపిటిసిలు బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, మాదవరెడ్డి, చేగు గ్రూపు సంస్థల అధినేత చేగు గోవర్ధన్ గుప్తా, బాధిత తల్లిదండ్రులకు నగదును అందజేశారు.

## వృద్ధులను పిల్లలు ఆధరించాలి..! : ఎస్ఐ

రామచంద్రాపురం, నవంబర్ 23 ప్రభాతవార్త:



వృద్దులను పిల్లలు ఆధరించి అక్కున చేర్చుకోవాలని ఎస్ఐ గిరిబాబు అన్నారు. బుధవా రం కమ్మపల్లి సమీపంలోని వృద్దా శ్రమం లో సేదదీరుతున్న వయోవృద్దు లకు ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయస్సు మీరిన వృద్దులకు తన వంతు సహాయంగా దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో కుమారు లు, కుమార్తెలు అండగా నిలిచి, తోడుగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ మునిరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

## పార్లమెంట్ మహిళ అధికారప్రతినిధిగా విజయకుమారి



తిరుపతి, నవంబర్ 23ప్రభాతవార్త:
టిడిపిని మరింత బలోపేతం చేసి, పార్లమెంట్ పరిధిలో గెలుపు లక్ష్యంగా తనవంతు పనిచేస్తానని తిరుపతి పార్లమెంట్ మహిళ కమిటీఅధికారప్రతినిధి కె.విజయకుమారి తెలిపారు. నూతనంగా ఈ పదవిలో విజయకుమారిని నియమిస్తూ పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్ ఉత్తర్వులు ఇచ్చారు. పార్టీ తనపట్ల నమ్మకం ఉంచి ఈ పదవిని అప్పగించినందుకు తన శ్రాయశక్తులా పనిచేస్తానని అన్నారు.

# స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పేద క్రీడాకారులకు అందని క్రీడా

తిరుపతి (విద్య), నవంబర్ 23 ప్రభాతవార్త :



స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పేద క్రీడాకారులకు క్రీడ అందని ద్రాక్షలా మారింది. స్విమ్మింగ్ ఫూల్, బేబీ స్విమ్మింగ్ పూల్ లక్షా ఇరవై వేలు, స్కేటింగ్ రింగ్ 50 వేలు, టెన్నిస్ కోర్ట్ 40,500, బ్యాడ్మింటన్ కోర్ట్ లక్షా రెండు వేలు కానీ క్రీడాకారులు నుంచి శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కి వచ్చే ఆదాయం స్విమింగ్ పూల్ 1,45,000, స్కేటింగ్ రింగ్ 48000, టెన్నిస్ కోర్ట్ 75,000, మీటింగ్ కోర్ట్ 1,10,000 ఇది క్రీడాకారుల చేత శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కి వచ్చే ఆదాయం. ఇప్పటికైనా కళ్ళు తెరవండి ప్రజలారా క్రీడాకారులు మనకు వస్తున్న ఆదాయాన్ని పరాయి పాలనకు చేతికి ఇస్తారా ఇది మన ఆదాయం ప్రభుత్వానికి తెలుసు. అనుకున్నదే అయింది ఏకపక్ష నిర్ణయంతో తీసుకున్న జగన్ ప్రభుత్వ శాప్ ఎండి ప్రభాకర్ రెడ్డి అయిన ఆలోచనలు ఏ వైపు పేద క్రీడాకారులవైపు లేక కాంట్రాక్టు వైపా. ఈ నిర్లక్ష్యానికి మూల్యం తప్పదు ఇప్పటికే అనేక జిల్లాల్లో ఆందోళన చేస్తున్న క్రీడా సంఘాలు ఇప్పటికైనా ఆలోచించి కాంట్రాక్టు రద్దు చేయాలని పేద పిల్లలకు క్రీడాకారులకు అన్యాయం చేస్తారని ప్రార్థిస్తున్నా క్రీడాకారుడు క్రీడా సంఘాలు తిరుపతి శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్‌లో వస్తున్న ఆదాయం గవర్నమెంట్‌కి సాల్లేదా అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎక్కువ ఆదాయాన్ని ఇస్తున్న శ్రీనివాస స్పోర్ట్స్ సముదాయంలో కాంట్రాక్ట్ పరం చేయడం ఏ విధంగా న్యాయం గవర్నమెంట్‌కి ఆదాయం వచ్చే ఈ సంస్థని ప్రైవేటీకరణ చేయడం ఆలోచనని మానుకోవాలి. శాప్ ఎండి పై వస్తున్న వ్యతిరేకతను ఇప్పటికైనా శాప్ ఎండి ప్రభాకర్ రెడ్డి ఆలోచించి ఈ కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలని క్రీడా ప్రముఖులు, క్రీడాకారులు ప్రార్థిస్తున్నారు.

## విద్యుత్ వెలుగుల్లో స్వర్ణముఖినదీ సోయగం..

శ్రీకాళహస్తి, నవంబర్ 23 ప్రభాతవార్త





కార్తీకమాసం సందర్భంగా రాజగోపుర రాజసం మరియు ఆలయ గోపురాలు, పరిసరాలు విద్యుత్ కాంతులతో విరాజిల్లుతున్నాయి. ఎన్నడూ లేని విధంగా ఆలయంలోని గోపురాలను, భిక్షాలగోపురంను విద్యుత్‌కాంతులతో ముస్తాబుచేశారు. కాగా గత పదిరోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల నదిలో నీరు పారుతోంది. రాజగోపురం రాజసం, ఆలయ పరిసరాలు విహంగవీక్షణం చిత్రంలో చూడవచ్చును. కాగా స్వర్ణముఖినదిలో ఇటీవల కురిసిన వర్షాలకు నదిలో నీరు చేరుతోంది. దీంతోభక్తులు పరవశం చెందుతున్నారు.

## మరుగు కరువై...మహిళల కష్టాలు

సచివాలయ వ్యవస్థలు సక్రమమేనా..?

చంద్రగిరి-ప్రభాతవార్త:




మరుగు కరువై మహిళలు మంచినీరు త్రాగడానికి సైతం కష్టాలు పడుతున్న వైనం సచివాలయ వ్యవస్థను అబాసుపాలు చేస్తున్నది. ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించే సమున్నత ఆశయంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రతి రెండు వేల మందికి ఒక సచివాలయం ఏర్పాటు చేసింది. అయితే ఇందులో విధులు నిర్వహిస్తున్న వారికి కనీస ప్రాథమిక సౌకర్యాలు కల్పించడంలో ఇప్పటికీ అక్కడక్కడా విఫలమైన అంశాలు వెలుగు చూస్తున్నాయి. ఇందులో మచ్చుకు మండల పరిధిలోని చిన్నరామాపురం గ్రామ పంచాయతీలోని సచివాలయంలో సచివాలయ నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చినప్పటికీ మరుగుదొడ్లు వినియోగంలోకి రాకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కడుపునిండా భోజనం చేయాలన్నా, కనీసం తృప్తిగా మంచినీరు త్రాగాలన్నా భయపడే దుస్థితినెలకొన్నది. అయితే ఇదేవిధంగా మండల వ్యాప్తంగా మరికొన్ని సచివాలయాలలో మరుగు కరువై మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ అనారోగ్య సమస్యలతో భాధపడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించి సచివాలయ వ్యవస్థలు సక్రమమేనా అనేది పరిశీలించి వెంటనే సమస్య తీవ్రతను గుర్తించి పరిష్కరించాల్సి వున్నది.

## శ్రీకాళహస్తి అగ్నిమాపకాధికారి సస్పెండ్!

శ్రీకాళహస్తి, నవంబర్ 23 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి అగ్నిమాపకాధికారి ఎ.భీమలింగయ్యను సస్పెండ్ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.రాయచోటి నుంచి వచ్చిన భీమలింగయ్య శ్రీకాళహస్తి అగ్నిమాపకాధికారిగా జూలై 3వతేదీన బాధ్యతలు స్వీకరించారు. ఈనేపధ్యంలో ప్రతి ఏడాది దీపావళి సందర్భంగా పట్టణంలోని ఏరియా ఆస్పత్రి మార్గంలో ఉన్న ఎస్వీపి బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేశారు. అయితే పర్యవేక్షణ చేయాల్సిన అగ్నిమాపకశాఖ అధికారులు టపాకాయల దుకాణదారుల వద్ద నుంచి మామూళ్ళు వసూళ్ళు చేయడం తెలిసిందే. చెన్నై-నాయుడుపేట బైపాస్ మార్గంలో ఓ నలుగురు వ్యక్తులు కలసి శ్రీలక్ష్మిగణపతి హోల్‌సేల్ టపాకాయల దుకాణాన్ని ఏర్పాటు చేశారు. అయితే దీపావళికి టపాకాయల దుకాణలు మాత్రం వేర్వేరుగా ఏర్పాటు చేసుకున్నారు. వీరిలో ఒకరు అగ్నిమాపకశాఖాధికారిపై జిల్లా అగ్నిమాపకశాఖాధికారికి మామూళ్ళు ఎక్కువగా తీసుకుంటున్నారని ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన ఆయన అగ్నిమాపకశాఖాధికారి భీమలింగయ్యను ఈనెల 10వతేదీన సస్పెండ్ చేశారు. అయితే లక్ష్మిగణపతి హోల్‌సేల్ టపాకాయల దుకాణంలో భాగస్వామిగా ఉన్న ఓవ్యక్తి కావాలనే అగ్నిమాపకశాఖాధికారిపై పిర్యాదు చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏది ఏమైనా ఎన్నడూ లేని విధంగా అగ్నిమాపకశాఖాధికారిని సస్పెండ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఓవర్గపోరుతో ఆయన్ను కావాలనే సస్పెండ్ చేయించినట్లు బాహాటంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం సత్యవేడు అగ్నిమాపకశాఖాధికారి ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు.

## నంది సింహవాహనాలపై స్వామిఅమ్మవార్ల దర్శనం

శ్రీకాళహస్తి, నవంబర్ 23 ప్రభాతవార్త



కార్తీకమాసం సందర్భంగా బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం స్వామిఅమ్మవార్లు బంగారునంది, బంగారు సింహవాహనాలపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయంలోని అలంకార మండపంలో స్వామిఅమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించి అర్చకులు పూజలు జరిపి హారతులిచ్చారు. అనంతరం స్వామిఅమ్మవార్లను బోయిలు మోసుకుంటూ ఓం నమఃశ్శివాయ నామస్మరణల మధ్య స్వామివారిని బంగారు నందివాహనంపై, అమ్మవారిని బంగారు సింహవాహనంపై ఆశీనుల్నిచేసి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. నాలుగుమాడావీధుల్లో భక్తులు స్వామిఅమ్మవార్ల దర్శనం చేసుకుని హారతులిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు, ఈవో వికె.సాగర్‌బాబు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేకాహ్వానితులు పాల్గొన్నారు.

# ఇంటింటికి జగనన్న పథకాలు అందుతున్నాయా? : ఎంఎల్‌ఏ

శ్రీకాళహస్తి రూరల్,నవంబర్ 23 ప్రభాతవార్త :

భారత దేశ చరిత్రలో ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి చేపట్టని రీతిలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి రూ.5నుంచి పది లక్షలు లబ్ధి పొందుతున్నారని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. బుధవారం ఆయన వర్షం పడుతున్నా లెక్క చేయక శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలను కందాడ సచివాలయం పరిధిలో నిర్వహించారు.ఏ గ్రామానికి వెళ్ళిన ప్రజలు హారతులిస్తూ స్వాగతం పలుకుతున్నారు.మహిళలు ఉత్సాహంగా ఎంఎల్‌ఏ పర్యటనకు వస్తున్నారు. శాసనసభ్యుడుబియ్యపు మధుసూధనరెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు సంబంధించి వాకబు చేస్తున్నారు. పెన్షన్లు, విద్యాదీవెన,రైతు భరోసా పథకాలకు సంబంధించి గ్రామాల వారీగా వివరాలతో జనంతో చర్చిస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం అయినా ఇలాంటి పథకాలు అందించారా? అని ప్రశ్నిస్తున్నారు. మాయ మాటలు చెప్పి మీ బిడ్డలను మభ్యపెట్టె సినీ నటులు వస్తారు? జాగ్రత్త అంటూ పరోక్షంగా పవన్ కళ్యాణ్‌ను విమర్శిస్తున్నారు. అయితే జనం మాకు ఇన్ని పథకాలు అందిస్తున్న జగనన్నయే మళ్లీ ముఖ్యమంత్రి ఆశీర్వదిస్తున్నారు.



ఏర్పేడు ఏ ప్రభుత్వం అయినా పట్టించుకుందా? శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని దీర్ఘకాలం ఒకే పార్టీ ఒకే కుటుంబం పరిపాలించింది. ఏర్పేడు మండలం అభివృద్ధిగురించి పట్టించుకున్నారా? అని ప్రశిస్తూ ముందుకు సాగారు. జగనన్న పాలనలో పరిశ్రమలు, విద్యాసంస్థలు, విమానాశ్రయం అభివృద్ధి,కేంద్ర విద్యాసంస్థలు ప్రగతిని అలాగే రైతాంగాన్ని గురించి పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు.పరిశ్రమల స్థాపనతో మండలం లోని వేలాది మంది నిరోద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించారని జనానికి వివరిస్తున్నారు. వికృతమాల సమీపంలో విమానాశ్రయం వద్ద ఏర్పాటుచేసిన డిక్సన్ పరిశ్రమతో నేడు ఎందరు నిరుద్యోగులు జీవనోపాధి కల్గి ఉన్నారని ప్రశ్నించారు. మీ సమస్యలుంటే నా దృష్టికి తీసుకురమ్మని ఎంఎల్‌ఏ పిలుపు నిస్తూ తన మొబైల్ నెంబర్‌ను అందిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయి మాయ గాళ్ళు వస్తారు. ఎన్నికలు ముగిసిన తరువాత హైదరాబాదుకు బయలుదేరుతారు. ఎప్పుడూ మీకుఅందుబాటులో ఉంటే నాయకుడు కావాలా? చుట్టపుచూపుగా వచ్చే నాయకులు కావాలో తెల్చుకోవాల్సిన ఎన్నికలు త్వరలో రాబోతున్నాయని చైతన్య పరుస్తున్నారు.ఈ కార్యక్రమాల్లో మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి జడ్‌పిటిసి తిరుమలయ్య, ఎంపిపి గీత,వైస్ ఎంపిపి జనార్ధన్‌రెడ్డి,ఎంపిటిసి భాస్కర్‌రెడడ్డి, శ్రీనివాసయాదవ్, సింగిల్‌విండో ఛైర్మెన్ జనార్ధన్ యాదవ్,మాండ్యం రాజారెడ్డి, వెంకటేష్ రాయల్, శేఖర్‌రాజు, కే.మణి, నాగరాజు, షణ్ముగం రెడ్డి,గోపి, బత్తిశెట్టి, శంకర్ యాదవ్, గురునాధం తదితరులు పాల్గొన్నారు.

## తడలో కుండపోత వర్షం

- ఒక్క రాత్రిలో 94.2 మిమీల వర్షపాతం



తడ, నవంబర్ 23 ప్రభాతవార్త

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో తడ మండలంలో కుండపోత వర్షం కురుస్తోంది. మంగళవారం అర్ధరాత్రి మొదలైన వర్షం బుధవారం రాత్రి దాకా జల్లులుజల్లులుగా కురుస్తూనే ఉంది. బుధవారం ఉదయం ఇక్కడ 94.2 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. 2022లో ఇది రెండవ అత్యధిక వర్షపాతం. కుండపోత వర్షంతో తెల్లవారే సరికి మండల పరిధిలోని పలు పంట కాలువలకు నీళ్లు చేరాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అయితే గత నాలుగు రోజులుగా తుపాను ప్రభావం తీవ్రంగా ఉన్న కారణంగా అధికారులు గ్రామాల్లో హెచ్చరికలు జారీ చేయడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. ముఖ్యంగా మండల పరిధిలోని పులికాట్ జాలర్ల కుప్పాల వారు వేట మానుకొని ముందుగానే ఊళ్లకు చేరుకోవడంతో నష్టం తప్పింది. పులికాట్ సరస్సు మధ్యలో ఉన్న ఇరకం దీవి గ్రామస్థులు కూడా ఎక్కడికీ వెళ్లకపోవడంతో బుధవారం అంతా ప్రశాంతంగానే ఉంది. అధికారులు కొన్ని మారుమూల గ్రామాలకు వెళ్లి లోతట్టు ప్రాంతాల నుంచి అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని భరోసా ఇచ్చారు. తిరుపతి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తడ మండల అధికారులు అప్రమత్తం అయ్యారు. రైతులు మాత్రం ఈ వర్షంతో రెట్టించిన ఉత్సాహంతో కనిపిస్తున్నారు. అయితే ఇది మరింత ఎక్కువ కాకుండా ఉంటే పల్లపు ప్రాంతాల పొలాలకు కూడా ఇబ్బంది ఉండదని నమ్ముతున్నారు.

## షార్‌లో పీఎస్‌ఎల్‌వీ సీ-54 ప్రయోగానికి లాంచ్ రిహార్సల్స్ పూర్తి

శ్రీహరికోట (తడ), నవంబర్ 23 ప్రభాతవార్త :



శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రంలో బుధవారం పీఎస్ఎల్‌వీ సీ-54 రాకెట్ ప్రయోగానికి సంబంధించిన లాంచ్ రిహార్సల్స్ విజయవంతంగా పూర్తి చేశారు. ఇప్పటికే 9 ఉపగ్రహాలను అనుసంధానం చేసిన రాకెట్ షార్‌లోని ఫస్ట్ లాంచ్ ప్యాడ్ వద్ద ప్రయోగానికి సిద్ధంగా ఉంది. ఇక తుది పరీక్షలు, కీలక సమావేశాలు నిర్వహించి రాకెట్‌ను ఈ నెల 26న అంతరిక్షంలోకి వదలనున్నారు. కీలకమైన లాంచ్ ఆథరైజేషన్ బోర్డ్, మిషన్ రెడీనెస్ రివ్యూ వంటి సమావేశాలు ముగిసిన తర్వాత ఖచ్చితమైన సమయాన్ని నిర్ధారిస్తారు. ప్రస్తుతానికి శనివారం మధ్యాహ్నం 11.56 గంటలుగా ప్రయోగ సమయాన్ని చెప్పి ఉన్నారు. ఈ రాకెట్ ద్వారా మన భూ పరిశీలన ఉపగ్రహంఇఓఎస్06తపాటు మరో 8 ఉపగ్రహాలను ప్రయోగిస్తున్నారు.

## వేరుశనగ విత్తనాలు పంపిణీ

వడమాలపేట, నవంబరు 23 ప్రభాతవార్త:



రబీ సీజన్‌కు అవసరమైన వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి రోజా సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మిలు బుధవారం ప్రారంభించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ పంపిణీ కార్యక్రమంలో జరిగింది. ఈ విత్తన కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. వేరుశనగ కాయలు 30 కేజీల బస్తాతో పాటు విత్తనశుద్ధి మందును రూ.1600లకు రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి విజయకుమార్ తెలిపారు. వేరుశనగ కాయలు కావలసిన రైతులు పట్టాదారు పాసుబుక్, ఆధార్‌కార్డు తీసుకుని గ్రామ రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని తెలిపారు. అలాగే మినుములు నాలుగు కేజీల నుంచి సబ్సిడీ పోను 80 రూపాయలకు అందుబాటులో ఉన్నాయన్నారు. శుక్రవారం నుంచి రైతులకు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ, వైస్ ఎంపీపీ లోకేశ్వర్‌రెడ్డి, కాయంపేట సింగిల్‌విండో ఛైర్మన్ సుధీర్‌రెడ్డి, పుత్తూరు మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ చుక్కా శేఖర్, సర్పంచ్‌లు అంజమ్మ, మునెమ్మ, నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, ఉమాపతి, వెంకట్‌రెడ్డి, అయ్యప్పరెడ్డి, కిరణ్, నందయ్య, ఎంపీటీసీలు, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## అటో డ్రైవర్ల చొరవతో..గుంతకు మట్టి

శ్రీకాళహస్తి,నవంబర్ 23 ప్రభాతవార్త :



ఎక్కడ ఏ సమస్య తలెత్తినా ఆర్ అండ్ బి అధికారులు పత్తాలేదు,ఈ నేపధ్యంలో రెండు రోజుల ముసారతో పట్టణ పరిధిలోని రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి.బుధవారం పట్టణ పొలిమేరల్లోని ఎపి సీడ్స్ కార్పొరేషన్ కూడలి వద్ద ఆర్‌అండ్‌బి రోడ్డుకు పెద్ద గుంత ఏర్పడింది,ఈ గుంత గురించి ఆర్‌అండ్‌బి అధికారులు పట్టించుకోలేదు. ఈ రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు పయనిస్తాయి. తిరుపతి వైపు నుంచి వచ్చే వాహనాలు పట్టణంలోకి ఈ రోడ్డు మీదనుంచే పయనించాలి.ఈ దుస్తితిని ఆర్‌అండ్ బి అదికారులు పట్టించుకోలేదు. పాలకులు గుర్తించరు. దాంతో ఈ మార్గంలో ఇబ్బందిగా పయనిస్తున్న ఆటో డ్రైవర్లు స్పందించారు. కొందరు డ్రైవర్లు గుంటను పూడ్చారు. రోడ్లపైగుంతలు ఏర్పడితే పోలీసులో జనం స్పందించటం తప్ప సంబందిత అధికారులు స్పందించటం లేదు.దాంతో చిన్న గుంతలు పెద్ద తటాకాలుగా మారుతున్నాయి. బుధవారం ఆటో డ్రైవర్ల చొరవతో గుంత కొంత వరకు బాగుపడింది.

## ఎంఎల్‌ఏ చెవిరెడ్డి చొరవతో సమగ్రాభివృద్ధి : ఎంపిపి

చంద్రగిరి, నవంబర్ 23 ప్రభాతవార్త:



ఎంఎల్‌ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రత్యేక చొరవతో మండల సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపిపి మావిళిరెడ్డి గారి హేమేంద్రకుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోనూ తుడా నిధులు సిసి రోడ్లు, ద్యానమందిరాలు, రచ్చబండలు, వాటర్ ప్లాంట్‌లు, గ్రంధాలయ భవనాలు వంటి అనేక పనుల చేపట్టినట్లు వివరించారు. ఈ క్రమంలో వివిధ విభాగాల అధికారులు చేపట్టిన అభివృద్ధి పనులు, వాటి పురోగతిని వివరించారు. కళ్యాణీ డ్యామ్ మన మండలంలో వున్నప్పటికీ చుక్కనీటికి నోచుకోలేకపోతున్నామని అన్నారు. తిరుపతి, తిరుమలకు నీటిని ఉపయోగించుకుంటున్నారన్న ఆయన మండలానికి కళ్యాణీ డ్యామ్ నీటిని కేటాయించే విధంగా తీర్మాణం చేయాలని ఆరేపల్లి రంగంపేట ఎంపిటిసి బోస్ చంద్రారెడ్డి కోరారు. ఇరిగేషన్ అధికారుల కారణంగా గత ఏడాది వర్షపునీటిని కాపాడుకోలేకపోయినట్లు దుయ్యబట్టారు. అదేవిధంగా పిచ్చినాయుడుపల్లి పంచాయతీ పరిధిలో 5 గ్రామాలు వున్నాయనీ, తమకు ఆర్టీసి బస్సు సౌకర్యం కల్పించాలని పంచాయతీ సర్పంచ్‌భాస్కర్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రమేష్‌బాబు, ఎంపిటిసిలు బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, ఎ.సి.శేఖర్, మాదవరెడ్డి, అజీజా నుస్రత్ బహార్, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి 30వ నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ పోటీలకు...

ఎస్వీ క్యాంపస్ పాఠశాల విద్యార్థిని పల్లవి ఎంపిక

తిరుపతి (క్రీడా), నవంబర్ 23 ప్రభాతవార్త :



ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏపి కాస్ట్ విజయవాడ వారు నిర్వహించిన 30వ నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ 2022 జిల్లా స్థాయి పోటీలలో 94 ప్రాజెక్టులు పాల్గొనగా శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ క్యాంపస్ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థిని పల్లవి రాష్ట్ర స్థాయి పోటీలకు మొదటి ప్రాజెక్టుగా ఎకో సిస్టం ఫర్ హెల్త్ అండ్ వెల్ బీయింగ్ ఎంపికైయ్యారు. గైడ్ ఉపాధ్యాయురాలు హెడ్ మిసెస్ షకీనమ్మ ఆధ్వర్యంలో విద్యార్థి ప్రాజెక్టును సమర్పించారు. తిరుపతి జిల్లా విద్యా శాఖ అధికారి శేఖర్ బహుమతి ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు కెవి రాజు, మాధవి, లత పాల్గొన్నారు.

## అక్కారంపల్లి మాస్టర్ ప్లాన్ రోడ్డు పరిశీలించిన కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 23, ప్రభాతవార్త :



నగర పాలక సంస్థ పరిధిలోని అక్కారంపల్లి వద్ద ఏర్పాటు చేస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను జోరువానలో సైతం కమిషనర్ అనుపమ అంజలి పరిశీలించారు. బుధవారం మధ్యాహ్నం కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణ రెడ్డి, అదనపు కమిషనర్ సునీత, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి అక్కారంపల్లి స్కూల్ వద్దకు చేరుకున్న మాస్టర్ ప్లాన్ వెళ్తున్న మార్గంలో ఉన్న నిర్మాణాలను పరిశీలించారు. ఇల్లు కోల్పోతున్న వారికి వెంటనే టిడిఆర్ బాండ్లు అందించాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు తీసి మురుగునీరు వెళ్లేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు సమన్వయం చేసుకుని రోడ్డు ఏర్పాటు చేసి గ్రావెల్‌తో నింపి వాహనాల రాకపోకలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డిఈ విజయ కుమార్ రెడ్డి, ఏసిపి బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఇండోర్ స్టేడియం పనులను వేగవంతం చేయండి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 23 ప్రభాతవార్త :



తిరుపతి, తుడా మైదానం ప్రక్కన జరుగుతున్న ఇండోర్ స్టేడియం వేగవంతం చేయాలని తిరుపతి మున్సిపల్‌కార్పొరేషన్ కమిషనర్ , తిరుపతి స్మార్ట్ సిటీ ఎండి అనుపమ అంజలి అన్నారు. ఇండోర్ స్టేడియం పనులను బుధవారం ఆమె పరిశీలించారు. పనులు చాలా ఆలస్యం అవుతున్నాయని కాంట్రాక్టర్‌కి చెబుతూ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసారు. ఈ సందర్భంగా కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ ఆరు కోట్ల రూపాయిలతో స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న ఈ ఇండోర్ స్టేడియంలో షటిల్, కబాడి, బాస్కెట్ బాల్, జిమ్నాయిజం కోర్టులు ఆటలు ఆడేందుకు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ ఇండోర్ స్టేడియం అందుబాటులోకి వస్తే క్రీడాకారులకే కాకుండా తిరుపతి ప్రజలకు కూడా ఒక మంచి ఇండోర్ క్రీడా సముదాయం ఉత్సహాన్ని కల్గిస్తుందని కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. వచ్చే రెండు నెలల్లోపు ఈ స్టేడియంను క్రీడాకారులకు, ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు తెలిపినట్లు కమిషనర్ అనుపమ అంజలి వివరించారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఏయికామ్ సంస్థ బాలాజీ, సంబంధిత కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

## పెద్దపరియలో అక్రమ నిర్మాణాలు

ఓజిలి, నవంబర్ 23 ప్రభాతవార్త :



అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఓజిలి మండలం పెద్దపరియ కూడలిలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమ నిర్మాణాలతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడుతోంది. ప్రభుత్వనిబంధనలు సైతం పట్టించుకోవడం లేదు. రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి అనుమతు లు లేకుండానే వ్యాపార సముదాయాలు నిర్మిస్తున్నారు. యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. కళ్లెదుటే నిబంధనలు ఉల్లంఘించి భవనాలు వెలుస్తున్నాయి. వీటిని పట్టించుకోవాల్సిన సంబంధిత అధికారులు ఉదాసీనత వైఖరి ప్రదర్శిస్తున్నట్లు సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవు : తహసీల్దార్

రేణిగుంట, నవంబరు 23 ప్రభాతవార్త:

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఇసుకాసురులను ఎట్టి పరిస్థితుల్లో వదిలి పెట్టమని రేణిగుంట తహసీల్దార్ హెచ్చరించారు. రేణిగుంట మండలం ఎస్‌ఆర్ పట్టెడ, కోట్రమంగళం ప్రాంతాల్లో బుధవారం రెవెన్యూ అధికారులు పోలీసులతో కలసి ఇసుక దంపులపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. దాదాపు 150 టిప్పర్ల ఇసుక దంపులను పది ప్రాంతాల్లో తహసీల్దార్ శివప్రసాద్ గుర్తించారు. దంపులను సీజ్ చేయడంతో పాటు నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని గాజులమండ్యం పోలీసులకు అప్పగించారు. తమకు



అందిన రహస్య సమాచారం మేరకు ఆకస్మిక దాడులు నిర్వహించామని తహసీల్దార్ తెలిపారు. ఈ దాడుల్లో జరుగుతున్న ఇసుక రవాణా అక్రమాలు బయటపడ్డాయన్నారు. ఇసుకను అనుమతులు లేకుండా తరలించడం నేరమన్నారు. తరలిస్తున్న వారు ఎంతటి వారైనా ఉపేక్షింపబోమన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.

కమిటీని వేసి విచారణ జరుపుతామన్నారు. తహసీల్దార్‌తో పాటు డీటీ ప్రేమ్‌కుమార్, ఆర్ఐ దిలీప్, వీఆర్‌వోలు చంద్ర, రామూర్తి, హేమంత్, సుందరం, కిషోర్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.